జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 30, జూన్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

# ఒకరు రాజు గారు.. మరొకరు రావు గారు!

- బాబు వస్తే ఏబీని అందలమెక్కిస్తారన్న ప్రచారం
- ఏబీవీకి పెద్ద పీట వేస్తారని కార్యకర్తల అంచనాలు
- అనురాగ్‌శర్మ మాదిరిగా సలహాదారు పదవి ఇస్తారని ప్రచారం
- ఇప్పటివరకూ కదలిక లేని పరిస్థితి
- తెరపైకి అనూహ్యంగా లక్ష్మీపార్థసారథి
- ఆమెకు సీఆర్డీయే బాధ్యతలు
- జగన్‌తో పోరాడిన ఏబీకి మొండిచేయేనా?
- రఘురామకృష్ణంరాజు పైనా అదే అంచనాలు
- ఆయనకు స్పీకర్, టీటీడీ ఛైర్మన్, ఢిల్లీలో అధికార ప్రతినిధి ఇచ్చేసిన మీడియా
- రాజు-రావుకు ఏం ఇస్తారన్న దానిపై టీడీపీలో చర్చ

(మార్తి సుబ్రహ్మణ్యం)

కాలం కర్మం కలసి వస్తే ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి డీజీపీ కావలసిన సీనియర్ ఐపిఎస్ అధికారి. కానీ జగన్‌రెడ్డి పైశాచిక రాక్షసానందానికి బలయిపోయి, పోస్టింగుకూ నోచుకోకుండా ఐదేళ్లూ సస్పెన్షన్‌తో కాలం గడిపేసిన విషాదం ఆయనది. మళ్లీ సర్వీసులో చేరకుండా, కోట్లాదిరూపాయల ప్రజాధనాన్ని లాయర్లకు తగలేసిన రాక్షసరాజ్యంపై, ఆయన చేసిన న్యాయపోరాటం చివరాఖరకు గెలిచి నిలిచింది. కానీ ఏం లాభం? అదేరోజు జాయినింగ్. అదేరోజు రిటైర్మెంట్! సర్వీసులో ఉంటూ రిటైరయ్యానని ఆనందపడాలో, ఐదేళ్లు అవమానకరంగా విధి నిర్వహణకు దూరమయ్యానని, బాధపడాలో తెలియని



మానసిక వేదిక.

కారణం.. ఆయన గత తెలుగుదేశం సర్కారుకు శ్రమదానం చేశారన్నది వైసీపీ సర్కారు ఆగ్రహం. టీడీపీ సర్కారుకు 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను, ఇప్పటి పాలకపార్టీ దొడ్డిలో కట్టేశారన్న కసి. అందుకే ఆయనను జగన్‌రెడ్డి సర్కారు పాలన నుంచి వెలేసింది. మరిప్పుడు ఆయన అప్పుడు శ్రమదానం చేసిన పార్టీనే అధికారంలోకి వచ్చింది. మామూలుగా కాదు తిరుగులేని మెజారిటీతో!



కానీ ఇప్పటివరకూ ఆ శ్రమదానవీరుడికి పిలిచి పెద్దపీట వేస్తారన్న చర్చ. కానీ ఆయనకు దక్కాల్సిన ప్రయోజనాలు కూడా దక్కని వైచిత్రి. ఇదీ మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు పరిస్థితి. మరి లోపం ఎవరిది?.. ఎక్కడ? ఇదీ ఇప్పుడు పోలీసు-రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్.

తెలుగు రాష్ట్రాల్లో ఏబీ వెంకటేశ్వరరావు.. రఘురామ కృష్ణంరాజు గురించి తెలియనివారుండరు. ఒకరు రావుగారయితే, మరొకరు రాజు గారు!




జజ్జనకరి జనారే..

# భారత్ భళారే!

## విశ్వవిజేతగా భారత్

## టీ20 ప్రపంచకప్ మనదే

## చెలరేగిన కోహ్లీ.. దంచికొట్టిన అక్షర్

బ్రిడ్జ్‌టౌన్: టీ20 ప్రపంచకప్ మనదే. 17 ఏళ్లుగా ఊరిస్తున్న పొట్టి కప్పును భారత్ రెండోసారి సగర్వంగా అందుకుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 7 పరుగుల తేడాతో మిగతా.. 2లో



## ప్రజలను కలిసేందుకు ఇక ప్రత్యేక విధానం

- బాబుకు వెల్లువెత్తిన సమస్యలు

మంగళగిరి,మహానాడు:
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతులు వెల్లువెత్తాయి. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి మిగతా.. 2లో




## ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

- ఎంతమంది నవ్వుతూ ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లారనేది ముఖ్యం
- వైద్యం అందించడం ఒక సామాజిక బాధ్యత
- వరంగల్‌లో హెల్త్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి చేస్తాం
- వరంగల్ మెడికవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వరంగల్,మహానాడు:
వైద్య రంగాన్ని విస్తరించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఇక్కడ హాస్పిటల్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. విద్య, వైద్యం, విద్యుత్ అందుబాటులో ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి సాధ్యమవుతుంది. హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందింది.

ఫార్మారంగం ఎప్పుడు చర్చకు వచ్చినా అందులో హైదరాబాద్‌కు స్థానం ఉంటుంది. ఇందుకు కారణం ఇందిరాగాంధీ దూర దృష్టి. మిగతా.. 2లో

## డి.శ్రీనివాస్ కన్నుమూత

హైదరాబాద్, మహానాడు:



కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్.. తెల్లవారుఝామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు.


డి.శ్రీనివాస్ సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్‌లో కొనసాగా. ఉమ్మడి ఏపీలో మంత్రిగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా పని చేశారు. 1989, 99, 2004లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. సుదీర్ఘ కాలం పాటు పీసీసీ అధ్యక్షుడిగా మిగతా.. 2లో

## మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత

ఆదిలాబాద్, మహానాడు:



ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుటాహుటీన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో తుది శ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల మిగతా.. 2లో



## పోలీస్ పోస్టింగ్ పరేషాన్..!

(వాసిరెడ్డి రవిచంద్ర)

ప్రభుత్వాలు మారినా పోలీస్ పోస్టింగుల్లో తీరు మారలేదని పలువురు సీనియర్ పోలీస్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఎలా అయితే పోలీస్ పోస్టింగుల కోసం వైరవీలు జరిగాయో అదే తరహాలో సీఐ/ఎస్ఐ పోస్టుల కోసం పోలీస్ రాజకీయ ప్రసన్నం కోసం పరుగులు తీయడం విమర్శలకు దారితీస్తుంది. ..గత వైసిపి ప్రభుత్వంలో కులముద్రవేసి, ..పార్టీ ముద్ర వేసి దూరంగా ఉంచిన ..పోలీసులకు ఈ ప్రభుత్వంలో కూడా అదే దూరం కనిపిస్తున్నట్లు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమైన స్టేషన్లో పోస్టింగులు కావాలంటే కులంతో పాటు.. మిగతా.. 2లో



బాబు గారు... మోడీ పిలక మీ చేతుల్లోనే ఉంది 3లో



కొండగట్టు అంజన్న సేవలో పవన్ కళ్యాణ్ 3లో



కాంగ్రెస్-మజ్లిస్ కుమ్మక్కు రాజకీయాలు 3లో



పోలవరం ఆలస్యం జగన్ పాపమే 4లో



బీజేపీ వైపు ఉద్యోగ సంఘాల చూపు? 4లో



బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు 8లో



స్వరూప పీఠానికి పప్పుబెల్లాల్లా భూములు 10లో




'గ్రేటర్'లో కంటోన్మెంట్ విలీనం 10లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 30, జూన్ 2024






## జజ్జనకరి జనారే.. భారత్ భళారే!

(మొదటిపేజీ తరువాయి..)

అద్వితీయమైన విజయం సాధించి విశ్వవిజేతగా అవతరించింది.

తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా.. కోహ్లీ (76: 59 బంతుల్లో 6ఐ4, 2ఐ6), అక్షర్ పటేల్ (47బీ 31 బంతుల్లో 1ఐ4, 4ఐ6) చెలరేగిన వేళ నిర్ణీత 20 ఓవర్లలో 7



వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులకే పరిమితం అయింది.

ఆ జట్టులో క్లాసెన్ (52: 27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. క్వింటన్ డికాక్ (39: 31 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్), స్టబ్స్ (31: 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్య 3, బుమ్రా 2, అర్ష్‌దీప్ సింగ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.


అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టపోయి 176 పరుగులు చేసింది. ఇన్నింగ్స్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (9) తక్కువ పరుగులకే ఔటయ్యాడు. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

అనంతరం క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ ఒక్క బంతి వ్యవధిలోనే డకౌట్‌గా వెనుదిరిగాడు. స్వల్ప వ్యవధిలోనే సూర్యకుమార్ యాదవ్ (3) సైతం రబాడా బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి క్లాసెన్‌కు దొరికిపోయాడు. ఐదు ఓవర్లలోనే కీలకమైన 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్‌ను అక్షర్ పటేల్‌తో కలిసి కోహ్లీ ఆదుకున్నాడు. వీరిద్దరూ కలిసి క్రీజులో నిలదొక్కుకొని వీలుచిక్కినప్పుడల్లా ఫోర్లు, సిక్సర్లు బాదేశారు.

అర్ధశతకానికి చేరువలో సమన్వయ లోపంతో అక్షర్ పటేల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. చివర్లో శివమ్ దూబె (27బీ 16 బంతుల్లో 3ఐ4,1ఐ6)తో కలిసి కోహ్లీ మెరుపులు మెరిపించాడు. జడేజా (2), హార్దిక్ పాండ్య (5లి) పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, నోకియా తలో 2 వికెట్లు పడగొట్టగా.. మార్కో యాన్సెన్, రబాడ చెరో వికెట్ తీశారు.

### భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది

**- ఏపి సీఎం చంద్రబాబు నాయుడు**



17 ఏళ్ల తర్వాత ప్రతిష్టాత్మకమైన T20 ప్రపంచకప్‌ను గెలుచుకోవాలనే కలను సాధించిన రోహిత్ శర్మ, మొత్తం జట్టు మరియు సహాయక సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. మన దేశాన్ని ఆనందం మరియు వేడు కల్లో ముంచెత్తినందుకు ధన్యవాదాలు.

## డి.శ్రీనివాస్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి..)

పని చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. కొద్ది రోజుల పాటు ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆపై రాజ్యసభ సభ్యునిగా సైతం కొనసాగారు. ఆ తరువాత అనారోగ్య కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

'అన్నా.. అంటే నేనున్నా అని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు. I WILL MISS YOU DADDY నా తండ్రి, నా గురువు అన్నీ మా నాన్నే.! ఎదురొడ్డు, పోరాడు, భయపడకు అని నేర్పింది మా నాన్నే.. ప్రజలను ప్రేమించు, ప్రజల కొరకే జీవించు అని చెప్పింది మా నాన్నే. నాన్నా..! నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు. ఎప్పటికీ నా లోనే ఉంటావు' అని ఎంపీ ధర్మపురి అరవింద్ ట్వీట్ చేశారు.






## ప్రజలను కలిసేందుకు ఇక ప్రత్యేక విధానం

(మొదటిపేజీ తరువాయి..)

వెళ్లిన చంద్రబాబు నాయుడుని వందల మంది కలిసి వినతులు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సామాన్య ప్రజలు, కార్యకర్తలు ముఖ్య మంత్రిని కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. తమ వ్యక్తి గత సమ స్యలను విన్నవించి సాయం అర్థించారు. ఓపిగ్గా అందరి నుండి వినతి పత్రాలు తీసుకున్న చంద్రబాబు నాయుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భారీగా తరలి వస్తున్న ప్రజలను కలిసేందుకు, ఇకపై ప్రత్యేక విధానాన్ని రూపొం దించాలని పార్టీ నేతలకు సూచించారు.





అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి సి.రామచంద్రయ్య



## పోలీస్ పోస్టింగ్ పరేషాన్..!

(మొదటిపేజీ తరువాయి..)

ముడుపులు ఇవ్వాల్సి వస్తుందన్న ఆవేదన కనిపిస్తుంది. ..ప్రజా పాలన ధ్యేయంగా అందరి సంక్షేమం కోసం పాటుపడతారన్న నమ్మకంతో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్‌లకు ఏకపక్షంగా విజయాన్ని ఇచ్చారు.

ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని స్థానాలు తెలుగు దేశానికే పట్టం కట్టారు. గత పాలనలో సిఐడి కేసులు కక్ష సాధింపులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, దోపిడీల నుండి విముక్తి కోసం తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తుందని ఆశించారు. ఇలా జరగాలంటే పోలీస్ వ్యవస్థ కట్టుదిట్టంగా పనిచేయాలి. ప్రజలు స్వేచ్ఛగా తిరిగేందుకు అవసరమైన పోలీస్ లా & ఆర్డర్ సక్రమంగా ఉండాలి. ముఖ్యంగా పట్టణ ప్రజానీకం అదే కోరుకుంటారు. అలా జరగాలంటే అవినీతి లేని పోలీసు వ్యవస్థ అవసరం. వచ్చే సిఐలు, ఎస్సైలు ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులకు ముడుపులు ఇస్తే ప్రజలపై వసూళ్లు తప్పవన్న వాదన సర్వత్రా వినిపిస్తుంది. అయితే గుంటూరు జిల్లాలో డీఎస్పీలు, సీఐలు ఎస్ఐల పోస్టింగుల్లో అధిష్టానం లోని యువ నేత జోక్యం పారదర్శకత పోలీసుకు దోహదపడుతుందని ఆశిస్తున్నారు. అయితే కులాలు, ఆర్థిక బలాల మధ్య పార్టీ కోసం కృషిచేసి పనిచేసిన నిజాయితీ పోలీసులు, వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బంది పడ్డ పోలీసుల ఈ ప్రభుత్వంలో కూడా దగాపడతారన్న అభద్రతాభావం అయితే ఆ శాఖలో కనిపిస్తుంది. ఇప్పటికే పైరవీలు జోరందుకున్నాయన్న విమర్శలు ఆ శాఖలో నిజాయితీ పోలీసులకు చెమటలు పుట్టిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కావాలని కులం పేరుతో, పార్టీ పేరుతో కక్ష కట్టి విఆర్ లో ఉంచిన పోలీసు కు ఈ ప్రభుత్వంలో పోస్టింగ్ ఉంటుందా లేదా అన్న అభద్రత అయితే కనిపిస్తుంది. మొత్తం పాలన నడిచే గుంటూరు జిల్లాలో పోలీస్ పోస్టింగుల్లో లోకేష్ ముద్ర ఎంతవరకు పని చేస్తుందన్నది ఆసక్తిగా మారింది. అయితే గతంలో వైసిపి ప్రభుత్వంలో పోస్టింగులు చేసి ఏకపక్షంగా ఆ ప్రభుత్వానికి అండగా ఉన్న పలువురు సిఐలు, ఎస్సైలు వారి కుల నేతల ద్వారా మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటూ ఆదాయం వచ్చే ఆ స్టేషన్ పోస్టింగ్ మాదే అంటూ కాలర్లు ఎగరేయడం, ఐదేళ్లు అరణ్య వాసం గడిపిన పోలీస్ అధికారులకు మాత్రం ఆందోళన కలిగిస్తుంది. వైసీపీతో అంటగాగిన పోలీస్ అధికారులు ఈ ప్రభుత్వంలో పోస్టింగులు కోసం పరుగులు తీయడమే ఆ శాఖలో దుమారానికి దారి తీస్తుంది. గుంటూరు నగరంలో నల్లపాడు, అరండల్ పేట, కొత్తపేట, లాలాపేట, పట్టాభిపురం సిఐ, ఎస్ఐల పోస్టింగులు కోసం మంత్రులు,ఎంపీ, ఎమ్మెల్యేల ప్రసన్నం కోసం పరుగులు కొనసాగుతున్నాయి. దీనిపై నూతన ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందా, పాత అవినీతి కథను కొనసాగిస్తుందా అన్నది ఆ శాఖలో కలవరంగా మారింది. అయితే ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారుల ఎంపికలో ప్రభుత్వం బి అలర్ట్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై యువనేత దృష్టిసారించినట్లు కూడా చెబుతు న్నారు. సిఐలు, ఎస్ఐల పోస్టింగుల్లోనే కొంత గందరగోళం నెలకొన్నట్లు కూడా ఆ శాఖలో ఆందోళన కనిపిస్తుంది. తిరిగి పోలీస్ శాఖ పోస్టింగుల్లో తప్పటడుగులు పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో చూడాలి మరి..

## మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి..)

పలువురు నేతలు సంతాపం ప్రకటించారు.

మాజీ ఎంపీ రమేష్ రాథోడ్‌ను పార్టీ నుంచి టీపీసీసీ సస్పెండ్ చేయడంతో.. ఆయన కూడా కాంగ్రెస్‌ను కాదనుకున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన రమేశ్‌రాథోడ్.. బీజేపీలో చేరిపోయారు. రమేష్ రాథోడ్ 2009లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2018లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేసి ఓడిపోయారు.

షెడ్యూల్ తెగలకు చెందిన రమేష్ రాథోడ్, అట్టడుగు స్థాయి నుంచి రాజకీయ నాయకుడుగా ఎదుగుతూ వచ్చారు. ఆయనకు సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. అతను 1999లో ఖానాపూర్ అసెంబ్లీ స్థానం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 2006-2009 మధ్య కాలంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన భార్య సుమన్ రాథోడ్ ఖానాపూర్ అసెంబ్లీ స్థానానికి 2009-2014 ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. అనంతరం ఖానాపూర్ అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు రమేశ్ రాథోడ్.

2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. జూన్ 2021 లో ఈటెల రాజేందర్ తోపాటు భారతీయ జనతా పార్టీలో చేరారు.

## ఒకరు రాజు గారు.. మరొకరు రావు గారు!

(మొదటిపేజీ తరువాయి..)

వారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరూ జగన్ బాధితులే. ఇద్దరూ జగన్‌పై పోరాడిన యోధులే. అందులో రాజుది రాజకీయ పోరాటమయితే, ఏబీవీది శాఖా పరమైన పోరాటం. టీడీపీ-జనసేన శ్రేణులు నిద్రావస్థలో ఉన్నప్పుడు.. పోరాడితే పోలీసులు ఎక్కడ కేసులు పెడతారోనన్న భయంతో వణికిపోయినప్పుడు.. జగన్ సర్కారుపై మొండి ధైర్యంతో తొడగొట్టి, ప్రజావ్యతిరేకత కూడగట్టేందుకు, ఇల్లెక్కి తొలి కోడికూసిన వ్యక్తి రఘురామకృష్ణంరాజు.

రాజుకు ఉండి ఎమ్మెల్యే సీటు అయితే దక్కింది. కానీ ఈ ఐదేళ్లలో ఆయన పెంచుకున్న ఇమేజ్‌పై పార్టీ-బయట ఒకటే చర్చ. మంత్రివర్గం ఏర్పడకముందు స్పీకర్ ఇస్తారని కొన్నిసార్లు, హెూంమంత్రి ఇస్తారని మరికొన్ని సార్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత టీటీడీ బోర్డు చైర్మన్ ఇస్తారని ఒకసారి.. ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి ఇస్తారని మరోసారి.. ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ ఇస్తారని ఇంకోసారి ప్రచారం జరిగింది. మొత్తానికి ఆయన ఉత్తి 'ఉండి రాజు'గారుగానే మిగిలిపోయారు. ఆయన ఎక్కడికి వెళ్లినా మీడియా-అభిమానులు.. మీకెందుకు పదవి రాలేదంటూ సానుభూతితో కూడిన ప్రశ్నల వర్షం. "ఎవరికి పదవి ఇవ్వాలనేది సీఎం గారి నిర్ణయం. దానిని ప్రశ్నించకూడదు కదా' అని చెప్పి, తప్పించుకోలేక రాజు గారి తలప్రాణం తోకకొస్తోంది.

ఇక ఏబీకి కోర్టు పుణ్యాన రిటైరైన రోజే మళ్లీ ఉద్యోగం దక్కింది. టీడీపీ కార్యకర్తగా పనిచేశారన్న కసితో, రావుగారు రెండుసార్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఒక సీఎంకు సెల్యూట్ కొట్టని ఏకైక ఐపిఎస్ అధికారి ఆయన. రాజు, ఏబీ గత ఐదేళు ఏ కార్యక్రమాలకు వెళ్లినా, జనం వారి చుట్టూ చేరి సెల్ఫీల కోసం పోటీలు పడేవారు. జగన్‌రెడ్డిపై యుద్ధం చేస్తుండటమే దానికి కారణం. మరి వీరి సేవలకు ప్రతిఫలం లేదా? వీరి పోరాటానికి గుర్తింపేదీ? ఇదీ ఇప్పుడు సోషల్‌మీడియాలో జరుగుతున్న చర్చ.

ఏబీ వెంకటేశ్వరరావును తక్షణం తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని క్యాట్, జగన్‌రెడ్డి సర్కారును ఆదేశించింది. ఐదేళ్ల పాటు ఆయనకు రావలసిన జీతభత్యాలు వెంటనే చెల్లించాలని ఆదేశించింది. దానిపై జగన్‌రెడ్డి సర్కారు హైకోర్టులో అపీలుకు వెళ్లింది. హైకోర్టు కూడా క్యాట్ తీర్పునే బలపరిచింది. ఎట్టకేలకూ ఆయనను రిటైర్మెంట్ రోజునే, సర్వీసులోకి తీసుకుంది. ఇది అందరికీ తెలిసిన కథనే.

టీడీపీ అధికారంలోకి వచ్చింది. మంత్రివర్గం కొలువు దీరింది. జగన్ భక్త జవహర్‌రెడ్డిని, ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఉద్వాసన పలికారు. జగన్ తాడేపల్లి ఇంటి వైపున్న బారికేడ్లు తొలగించారు. ఇంటి వెనుక మూసిన రోడ్డును జన సంచారం కోసం తిరిగి తెరిపించారు. కొందరు జగన్‌రెడ్డి విధేయ అధికారులను, జీఏడీలో రిపోర్టు చేయమని ఆదేశించారు.

గత సర్కారులో మంత్రుల వద్ద పనిచేసిన పీఏ, పీఎస్, ఓఎస్డీ, పీఆర్వోలను తీసుకోవద్దని ఆదేశించారు. జగన్‌రెడ్డి చేసిన అప్పుల వివరాలు సేకరించేందుకు, ఆర్థికశాఖ దుర్భిణి వేయడం మొదలెట్టింది. రిటైరన లక్ష్మీపార్ధసారథికి సీఆర్‌డీఏలో పెద్దపీట వేశారు. చంద్రబాబు సోమవారం తన పోల'వారాన్ని' ప్రారంభించారు. అంటే ప్రభుత్వం పనిచేయడం మొదలయిందన్నమాట.

కానీ కోర్టు ఆదే శాల ప్రకారం ఏబీ వెంకటేశ్వరరావుకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు మాత్రం ఇప్పటిదాకా అందలేదట. ఐదేళ్ల నుంచి సస్పెనషన్ కాలంలో ఆయనకు రావలసిన జీత భత్యాలను జగన్‌రెడ్డి సర్కారు పెండింగ్‌లో పెట్టింది. ఆయనకు జీతం చెల్లించాలని సుప్రీంకోర్టు నుంచి క్యాట్ వరకూ ఆదేశించినా, జగన్‌రెడ్డి సర్కారు ఖాతరు చేయలేదు. జగన్‌రెడ్డి పైశాచిక-వికృతానందంతో సస్పెన్షన్ చేసినందున, ఆయనకు జీతాలివ్వాలని ఆదేశించినా ఇవ్వకపోవడంలో పెద్ద ఆశ్చర్యం లేదు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా, ఏబీ పరిస్థితి అలాగే కొనసాగడం విచిత్రం. ఆయన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఫైలు ఇంచి కూడా కదలలేదట.

నిజానికి టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే, తొలి నామినేటెడ్ పదవి ఏబీవీకే దక్కుతుందని అటు టీడీపీ వర్గాలు, ఇటు పోలీసు వర్గాలు భావించాయి. ఎందుకంటే జగన్‌రెడ్డితో తీవ్రంగా నష్టపోయిన అధికారి కాబట్టి. ఆయనొక్కడే కాదు. చివరకు రాజకీయాలతో సంబంధం లేని, ఆయన వియ్యంకుడిని సైతం జగన్ సర్కారు అమరావతి భూముల కేసులో ముప్పు తిప్పలు పెట్టింది. ఆరకంగా జగన్ ఉన్మాదానికి-పైశాచికత్వానికి ఏబీ కుటుంబమే నష్టపోయిందన్నమాట.

కాగా తెలంగాణలో కేసీఆర్ వచ్చిన వెంటనే మాజీ ఐపిఎస్ అనురాగ్‌శర్మను పదవీకాలం ముగిసిన తర్వాత, లా అండ్ ఆర్డర్ సలహాదారుగా నియమించారు. పోలీసుశాఖలో బదిలీలు, పోస్టింగులన్నీ ఆయనే పర్యవేక్షించారు. ఏబీవీకి సైతం అలాగే సలహాదారు పదవి ఇస్తారని టీడీపీ-పోలీసు వర్గాలు ఆశించాయి. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి భక్త పోలీసులెవరో ఏబీవీకి తెలుసుకాబట్టి, వారిని ఏరివేసే బాధ్యత ఆయనకే అప్పగిస్తారని అంచనా వేశారు. ఏబీవీ వస్తే.. ఐదేళ్లలో జగన్‌రెడ్డితో నష్టపోయిన పోలీసు అధికారులకు, గౌరవప్రదమైన పోస్టింగులు వస్తాయని జగన్‌బాధిత పోలీసు అధికారులు ఆశించారు. కానీప్పటిదాకా అలాంటి ఛాయలేవీ కనిపించకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

దీనిపై రాజకీయ-పోలీసువర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ఏబీ సర్వీసులో లేనందువల్ల, ఆయనతో పని ఉండదు. అంటే ఆయన అవసరం కూడా ఉండదు. కావాలంటే ఇప్పుడున్న అలాంటి ఏబీలతోనే పని చేయించుకోవచ్చు. ప్రత్యేకించి ఆయనను తీసుకుని ఇబ్బందులు పడటం ఎందుకని ప్రభుత్వం భావిస్తుందా? లేక ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు.

ఇంకా సమయం ఉంది కాబట్టి, నిదా నంగా ఇద్దాములేనన్న వైఖరితో ఉందా? ఒకవేళ అదే నిజమైతే తొలి ప్రాధాన్యం ఏబీకి ఇవ్వకుండా.. ఎప్పుడో ఐదేళ్ల క్రితం పనిచేసిన లక్ష్మీపార్ధసారధికి ఎలా ఇచ్చారన్న చర్చ జరుగుతోంది.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 30, జూన్ 2024

## బాబు గారు...
# మోడీ పిలక మీ చేతుల్లోనే ఉంది

- పోలవరం ప్రాజెక్టు నిర్లక్ష్యం ఖరీదు అక్షరాల 76 వేల కోట్లు
- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి

**విజయవాడ,మహానాడు:**
కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలు అన్నట్లు... పోలవరం విధ్వంసానికి అసలు కారకులు బీజేపీ,టీడీపి,వైసీపీ పార్టీలే. ప్రాజెక్టు కట్టి 28లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆశయమయితే...పంతాలు పట్టింపులకు పోయి జీవనాడిపై ఇన్నాళ్లు జరిగింది రాజకీయ దాడి తప్పా మరోటి కాదు.

విభజన సమయంలో పోలవరానికి కాంగ్రెస్ జాతీయ హెూదా ఇస్తే...మోడీ సర్కార్ ఆ భాద్యత 10 ఏళ్లు విస్మరించి నిధులు ఇవ్వకుండా సవతి తల్లి ప్రేమ చూపింది. కేంద్రం కట్టాల్సిన ప్రాజెక్ట్‌ను తానే కడతానని చెప్పి పోలవారం, సోమవారం అంటూ హడావిడి తప్పా... బాబు మొదటి 5 ఏళ్లలో చేసింది శూన్యం.

రివర్స్ టెండరింగ్ పేరుతో జగన్ అంచనా వ్యయం పెంచాడే తప్ప ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. 10 వేల కోట్లతో కాంగ్రెస్ హయాంలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టుకు నిర్లక్ష్యం ఖరీదు అక్షరాల 76 వేల కోట్లు. ప్రాజెక్ట్ కట్టాలంటే మరో 5 ఏళ్లు పడుతుందని చెప్తున్న ముఖ్యమంత్రి



చంద్రబాబు...మోడీ పిలక మీ చేతుల్లోనే ఉంది. కేంద్రాన్ని శాసించే అధికారం మీ దగ్గరుంది కాబట్టి...పూర్తి స్థాయి నిధులు తెచ్చి,రాష్ట్రంపై ఆర్థిక భారం పడకుండా, పోలవరం పూర్తి చేయాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది.

## ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను
# నోటిఫై చేస్తూ గెజిట్

- సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్

**అమరావతి,మహానాడు:**
అమరావతిలో చేపట్టనున్న ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను నోటిఫై చేస్తూ సీఆర్డీఏ గెజిట్ జారీ చేసింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు నిర్మించనున్నారు. ప్రభుత్వ కాంప్లెక్స్ ప్రాంతమైన 1575 ఎకరాల ప్రాంతాన్ని సీఆర్డీఏ నోటిఫై చేసింది. మాస్టర్ ప్లాన్లో భాగంగా జోనింగ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. రాయపూడి, నేలపాడు, లింగాయ పాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాన్ని నోటిఫై చేసినట్లు సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్ వెల్లడించారు.





# గంటగంటకూ పించన్ల పంపిణీ పర్యవేక్షణ

- అదేరోజు 90 శాతం పంపిణీ పూర్తి కావాల్సిందే
- కలెక్టర్లకు సీఎస్ నీరబ్‌కుమార్ ఆదేశం
- ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీపై కలక్టర్లతో సిఎస్ వీడియో సమావేశం

**విజయవాడ,29 జూన్,మహానాడు:**
రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీపై శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జులై 1వ తేదీన 65 లక్షల 18వేల 496 మందికి గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింట ఫించన్లు పంపిణీకి సంబంధించి 4 వేల 399.89 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

అదే విధంగా ఫించన్ల పంపిణీకి ఇతర ఫంక్షన్ రీల సేవలను కూడా వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్లు ఎంపిడిఓ,మున్సిపల్ కమీషనర్లకు తగు ఆదేశాలు జారీ చేయాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఫించన్లు పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

సోమవారం ఉదయం 6గం.లకు పింఛన్లు పంపిణీ ప్రారంభం కావాలని సి ఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ జూలై 1వ తేదీన 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు.

పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన మొత్తాన్ని శనివారం రాత్రిలోగా విత్ డ్రా చేసుకోవాలని సిఎస్ స్పష్టం చేశారు. ఎక్కడైనా ఏ బ్యాంకైనా డబ్బును శనివారం రాత్రికి ఇవ్వలేకుంటే, అలాంటి




బ్యాంకులు ఆదివారం తెరిచి ఉంచి సంబంధిత ఫించన్ మొత్తాన్ని ఇవ్వాలని బ్యాంకులకు సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, యం.శివ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్‌గా ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి. సత్యనారాయణ, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతికి, డి.శ్రీనివాస్ మృతికి
# సీఎం చంద్రబాబు సంతాపం

**అమరావతి :** తెలంగాణకు చెందిన ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతి పట్ల సీఎం నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. రమేష్ రాథోడ్ అకాల మరణం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. తెలుగుదేశం పార్టీతో రమేష్ రాథోడ్‌కు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీగా, జడ్పీ ఛైర్మన్‌గా, ఖానాపూర్ ఎమ్మెల్యేగా గిరిజన ప్రజలకు రమేష్ రాథోడ్ విశేష సేవలందించా రన్నారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**డి. శ్రీనివాస్ మృతికి సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం**

**అమరావతి:** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర పిసిసి మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతికి సీఎం నారా చంద్రబాబు నాయడు సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డి. శ్రీనివాస్ మంత్రిగా, ఎంపిగా తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాం తిని కలిగించిందని అన్నారు. శ్రీనివాస్ ఎప్పుడూ హుందాగా రాజకీయాలు చేసేవారని తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. డి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం చంద్రబాబు ప్రార్థించారు.



# కాంగ్రెస్-మజ్లిస్ కుమ్మక్కు రాజకీయాలు

- ఎన్డీయేకు వ్యతిరేకంగా అంతర్జాతీయ శక్తువల కుట్ర
- సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి ముఖ్య నాయకులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లతో సమావేశమైన కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:**
ఎన్నికల్లో తాను గెలిచేందుకు కృషి చేసిన బీజేపీ కాన్యకన్తలు, నాయకులకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి కిషన్ రెడ్డి ఏమన్నా రంటే.. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ విజయం కోసం కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు. పార్లమెంటు ఎన్నికల తర్వాత పోలింగ్ బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లను కలవాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. గత లోక్ సభ ఎన్నికల్లో బిజెపి కార్యకర్తలందరూ ఎంతో కష్టపడ్డారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో నరేంద్ర మోదీని, బిజెపిని ఓడించాలనే కుట్రతో దేశ వ్యాప్తంగా కొన్ని అంతర్జాతీయ శక్తులు కుట్ర చేశాయి. ముఖ్యంగా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజక వర్గంలోని రెండు నియోజకవర్గాల్లో బిజెపి వ్యతిరేక శక్తులు (కాంగ్రెస్, ఎంఐఎం) ఏకమయ్యాయి.

సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే..2 అసెంబ్లీ నియోజకవర్గాల్లో (జూబ్లీహిల్స్, నాంపల్లి) బిజెపికి మెజారిటీ రాలేదు. నాంపల్లి నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ రూపంలో మజ్లిస్ పార్టీ పనిచేసింది. కాంగ్రెస్ పార్టీ గుర్తు కోసం, కాంగ్రెస్ పార్టీ జెండా కింద మజ్లిస్ పార్టీ పనిచేసింది.

నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఐఎంతో అవగాహనతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రచారమే నిర్వహించలేదు. పాదయాత్ర చేయలే.. సమావేశాలు నిర్వహించలేదు. భారతీయ జనతా పార్టీ తరఫున ఇక్కడ ఎన్నికల ఎత్తుగడను అవలంభించ డంలో కొంతవరకు విఫలమయ్యాం.

నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి 62 వేల ఓట్లు తగ్గాయి. ఆ ఓట్లు కాంగ్రెస్ కు పడ్డాయి. అయినా ప్రజల మద్దతుతో బిజెపి కి గతం కంటే ఓటింగ్ శాతం పెరిగింది.



ప్రధాని నరేంద్ర మోదీ పై ప్రపంచంలోని వివిధ దేశాధినేతలు ఆదరిస్తున్నారు. దీన్ని రాజకీయంగా జీర్ణించుకోలేని కొన్ని శక్తులు కుట్రలకు తెరలేపాయి.

వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో దేశ ప్రజల ఆశీర్వాదంతో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.దేశంలో ఎన్డీయేకు వ్యతిరేకంగా దేశానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ శక్తులు చాపకింద నీరులాగా పనిచేస్తున్నాయి.

జవహర్ లాల్ నెహ్రూ తర్వాత మూడోసారి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, హ్యాట్రిక్ ప్రధానిగా పదవి అలంకిరించిన ఘనత నరేంద్ర మోదీదే.



# కొండగట్టు అంజన్న సేవలో పవన్ కళ్యాణ్

- విజయానంతరం అంజన్నకు ప్రత్యేక పూజలు

**జగిత్యాల,మహానాడు:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం తమ ఇలవేల్పు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అంజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. గత ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వారాహి విజయ యాత్రకు ముందు వారాహి వాహనానికి కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం అనంతరం తెలంగాణ, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఆలయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్‌కి ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

ప్రధాన స్థానాచార్యులు కపీంద్ర స్వామి పవన్ కళ్యాణ్‌కి సంప్ర దాయబద్ధంగా తలపాగ చుట్టి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆంజనేయస్వామికి ఇరు వైపులా ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ అమ్మవార్లకు అర్చనలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించి, స్వామి వారి ప్రసాదం అందచేశారు.







4

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 30, జూన్ 2024





# పోలవరం ఆలస్యం జగన్ పాపమే

- **నాలుగేళ్లలో పోలవరం పూర్తి**
- **కొంపముంచిన రివర్స్ టెండర్**
- **ఏపీ బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి లంకా దినకర్**

**విజయవాడ,మహానాడు:**

పోలవరం ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేయడం వల్ల వాస్తవాలు బహిర్గతం అయ్యాయి. పోలవరం బహుళ ప్రయోజనకర ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ జీవనాడి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్ట్ 2019కి ముందు మొత్తం 72% ప్రాజెక్ట్ పూర్తయింది. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన తరువాత ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు 14,418.39 కోట్ల రూపాయలు. 2019 ముందు ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైకాపా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు వ్యయంలో మరియ సహయ, పునరావాస వ్యయం అంచనాలలో పూర్తి అవినీతిమయం అని ఆరోపణలు చేసింది.

జగన్ అధికారంలోకి వచ్చాక చేసిన ఆరోపణలకు సాక్ష్యలు చూపకుండా గత ప్రభుత్వం తయారు చేసిన అంచనాలనే కేంద్ర ప్రభుత్వ ఆమోదం కొరకు ప్రయత్నించారు. రివర్స్ టెండరింగ్ అంటూ ప్రాజెక్టు వ్యయం తగ్గించామనే ప్రచారం చేసినప్పుడు, ప్రాజెక్టు వ్యయం తగ్గకపోగా దాదాపు మరో 33% పెరగడం చూస్తున్నాం. వైఎస్ జగన్ నేతృత్వంలోని వైస్సార్సీపీ ప్రభుత్వ అనాలోచిత "రివర్స్ టెండరింగ్" మంత్రం కారణంగా తీవ్రమైన ఆలస్యం మరియు నష్టం జరిగింది. రివర్స్ టెండరింగ్ వల్ల భవిష్యత్ నష్టాల గురించి 3 ఆగస్ట 2019నే మేము హెచ్చరించడం జరిగింది. ఈ ప్రాజెక్ట్ పురోగతిలో తప్పుడు పాలన మరియు అవినీతి కారణంగా రాష్ట్రానికి ప్రాజెక్ట్ నిర్మాణాలు (ఆలస్యం కారణంగా కోతకు గురి కావడం), ఆర్థిక (వ్యయ పెరుగుదల) మరియు సమయం (అసాధారణ ఆలస్యం) నష్టం జరిగింది.

ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు, ఫ్యాక్టరీలకు పారిశ్రామిక నీటిని అందించడంలో వైఎస్ జగన్ రాజీపడినందున, చివరకు రాష్ట్రంలోని ప్రజలంతా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ అవసరాలను మరియు అవకాశాలను ప్రజలు కోల్పోయారు. ప్రజలకు ఆదాయం మరియు సంపద నష్టం, రాష్ట్ర - కేంద్ర ప్రభుత్వాలకు జీడీపీ మరియు రెవిన్యూ నష్టం సంభవించింది.

**పోలవరం ప్రాజెక్టు ముఖ్యమైన అంశాలు :**

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా 2019 లో ప్రమాణం చేసే నాటికి పోలవరం నిర్మాణం పనులు 70% పైగా జరిగాయి, గడచినా 5 సంవత్సరాలలో కనీసం 10% పనులుకూడా పూర్తీ కాలేదంటే వైకాపా నేతృత్వంలోని ప్రభుత్వానికి పోలవరం పైన ఎంత శ్రద్ధ పెట్టిందో అర్ధం అవుతుంది.

2019 ముందు పూర్తీ అయిన పనులు నిధులు కేంద్ర ప్రభుత్వం భర్తీ చేసినా తిరిగి ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టకుండా విడుదల చేసిన నిధులు 6 వేల కోట్లను పక్కకు మళ్లించడం వల్ల ప్రాజెక్టు పనులు నత్తనడకన నడిచాయి.

పోలవరం ప్రాజెక్టు అనుబంధంగా ఉన్న 960 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ అస్మదీయుల ద్వారా కొట్టేయడానికి ఉన్న శ్రద్ధ, ప్రాజెక్టు పైన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్టలేదు.

సకాలంలో ప్రస్తుత వైకాపా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తీ చేయకపోవడం వల్ల డయఫ్రామ్ వాల్, రివిట్మెంట్, ఎర్త్ కామ్ రాక్ ఫీల్ డ్యామ్ దెబ్బతిని మూడు వేల కోట్ల పైగా నిధులు వృధా అయ్యాయి.

వైకాపా ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ లో ఉన్న డిజైన్ ప్రాధాన్యత ప్రకారం కాకుండా పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేసి ఆ వ్యయం రీయంబర్స్మెంట్‌కి కేంద్రం వద్దకు రావడం వల్ల కూడా నిధులు విడుదలకు ఆలస్యం అయ్యింది.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సెంట్రల్ వాటర్ కమిషన్ లతో వైకాపా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పని చేయలేదు. రాబోయే 4 సంవత్సరాలలో ఎన్డీఏ నేతృత్వంలో కేంద్ర మరియు రాష్ట్ర సహకారంతో పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తాం.

పోలవరం పూర్తి చేయడంతోపాటు తప్పనిసరిగా " మహానది - గోదావరి - కృష్ణ - పెన్న - కావేరి " నదుల అనుసంధానం మరియు అనువైన ప్రాంతాలలో నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణం ద్వారా అన్ని రాష్ట్రాల మరియు దేశ పురోగతికి దోహద పడుతుంది.

# అరుంధతి రాయ్‌కు పురస్కారం!

- **ఇక నోబెల్ అవార్డే తరువాయి**

అరుంధతి రాయ్‌కు పెన్ ప్రింటర్ ప్రైజ్ వచ్చింది. ఈ దేశ రాజ్యాంగానికి, సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా పేలాపన చేసిన అరుంధతి రాయ్‌పై దేశంలో చట్టపరమైన విచారణ మొదలైన తరుణంలో ఆమెకు విదేశీ పెన్ ప్రింటర్ ప్రైజ్ వచ్చింది!

లోగడ ఆమెకు బూకర్ బహుమతి వచ్చింది. ఆ బహుమతితో ప్రాచుర్యంలోకి వచ్చి ఆమె దేశ వేర్పాటువాద శక్తుల్లో భాగమవడం మనం చూశాం. కాశ్మీర్ నరమేధాన్ని, కాశ్మీర్ హిందూ మహిళల మానభంగ ఘట్టాన్ని ఒక మహిళగా ఖండించకపోగా, ఆ దారుణాల్ని చేసిన విదేశీ మతోన్మాదుల్ని ఆమె సమర్థించడం టీ.వీ. చానళ్లలో మనం విన్నాం. ఆమె లోగడ శిక్షను అనుభవించిన నేరస్థురాలు- ఇదీ మనకు తెలిసిన నిజమే.

దేశవ్యతిరేక ప్రవర్తన ఫలితంగా అరుంధతి రాయ్‌పై న్యాయ విచారణ జరుగుతున్న సందర్భంలో ఆమెకు మరో విదేశీ పురస్కారం రావడం అప్రమత్తమై ఆలోచించాల్సిన విషయం. అరుంధతి రాయ్‌కు ఈ విదేశీ పెన్ ప్రింటర్ ప్రైజ్ రావడం భారతదేశ వ్యతిరేక ఎకో సిస్టమ్ పని తీరు ఏమిటో, ఎలా ఉంటుందో మనకు తెలియజేస్తోంది.

ప్రస్తుతం జరుగుతున్న విచారణలో పోలీస్ ఆమెను ఖైదు చేస్తే అరుంధతి రాయ్‌కు నొబెల్ బహుమతి కూడా వస్తుందా? ఒక వేళ అరుంధతి రాయ్ నేరస్థురాలు అని తేలితే, ఒకవేళ ఆమె అరెస్ట్ ఐతే భారతదేశ వ్యతిరేక ఎకో సిస్టమ్ సమర్థవంతంగా పనిచేసి, ఆమెకు నోబెల్ పురస్కారం వచ్చేట్లు చేస్తుందని మనం ఆశించవచ్చు. అమర్త్యా సేన్‌కు వచ్చినట్టుగా అరుంధతి రాయ్‌కు నోబెల్ కూడా తప్పకుండా వస్తుందేమో?




- రోచిష్మాన్

9444012279

# పింఛన్ల పంపిణీకి హాజరుకానున్న బాబు

- **మంగళగిరి నియోజవకర్గం పెనుమాకలో పింఛన్లు పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి**

**అమరావతి,మహానాడు:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మంగళ గిరి నియోజకవర్గం పెనుమాకలో ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సిఎం పాల్గొంటారు. అనంతరం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో ముచ్చటిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 65,18,496 మంది లబ్దిదారులకు రూ.4,408 కోట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్దమైంది. ఇందులో భాగంగా స్వయంగా సిఎం కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు.



## బుర్రిపాలెంలో ఆత్మీయులను కలిసిన
# కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**తెనాలి,మహానాడు:**

ముందుగా సంఘం జాగర్లమూడి గ్రామం నుంచి బుర్రిపాలెం గ్రామం వరకు దారిపొడవునా స్వాగతం పలికిన కూటమి నాయకులు కార్యకర్తలు.. బుర్రిపాలెం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని కేంద్ర మంత్రి చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్ళగా, వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

కేంద్ర మంత్రి చంద్రశేఖర్ కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా తన స్వగ్రామమైన బుర్రిపాలెంకు వెళ్తూ.. మార్గం మధ్యలో తండ్రి గారైన పెమ్మసాని సాంబశివరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.









# బీజేపీ వైపు ఉద్యోగ సంఘాల చూపు?

- **ఉద్యోగ సంఘాలు బీజేపీ యూటర్న్**
- **సీఎం రేవంత్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా అగౌరవం**
- **వేచి చూసీ చూసీ విసిగెత్తిపోయి**
- **జేపసీ మీటింగ్ పెట్టి అల్టిమేటం జారీ చేసినా కనీసం పట్టించుకోని రేవంత్**
- **టీఎన్‌జీవో, టీజీవోల అధ్యక్షులు, ముఖ్య నేతలంతా బీజేపీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు**
- **ఇక బీజేపీ స్టాండ్?**
- **ఉద్యోగ సంఘాల నేతలు ఢిల్లీలో బిజీ**

(దండుగుల శ్రీనివాస్)

కేసీఆర్ సర్కార్ అవమానపర్చింది. పట్టించుకోలేదు. ఆత్మ గౌరవం దెబ్బతినేలా ప్రవర్తించాడు కేసీఆర్. దీంతో ఎన్నికల్లో గట్టి బుద్దే చెప్పాయి ఉద్యోగ సంఘాలు. కాంగ్రెస్‌కు సపోర్టు దొరికింది. అధికారంలోకి వచ్చింది. కానీ ఇక్కడా అదే పరిస్తితి. అధికారంలోకి రాగానే ఏం అనలేదు.

కొంత సమయం ఇచ్చారు. ఉహూ.. పట్టించుకోరే. పైగా మీరంతా కేసీఆర్ మనుషులే అన్నారు. ఎలాగూ కక్షసాధింపు కాంగ్రెస్ కంటిన్యూ చేస్తోంది. అది ఉద్యోగ సంఘాలపైనా చూపుతున్నది. అందుకే వారు చెప్పింది పట్టించుకోవడం అటుంచి ఓసారి కూర్చుని మాట్లాడుకునేందుకు కూడా సమయం ఇవ్వలేదు రేవంత్ రెడ్డి.

చూసీ చూసీ విసిగి పోయి మూడు రోజుల కింద ఉద్యోగ జేఏసీ మీటింగొకటి పెట్టారు. డిమాండ్లు ముందుంచారు. అల్టిమేటం జారీ చేశారు. ఇలాగైనా కాంగ్రెస్ సర్కార్ దిగొస్తుందేమోనని. ఉహూ.. అయినా పట్టించుకోలేదు రేవంత్‌రెడ్డి. తను ఢిల్లీలో చాలా బిజీగా ఉన్నాడు. పీసీసీ చీఫ్‌ను ఎవరిని చేయాలి..? మంత్రి వర్గంలోకి తన టీమ్‌ను ఎవరిని తీసుకోవాలి..? రుణమాఫీ చేస్తానన్న హామీ ఎలా అమలు చేయాలి..?? పాపం.. ఇవే టెన్షన్లలో ఉన్నాడు. ఇక లాభం లేదనుకుని అప్పటికే టచ్‌లో ఉన్న బీజేపీకి బాహాటంగానే దగ్గరయ్యేందుకు డిసైడ్ అయ్యారు. పోలోమని టీఎన్‌జీవో, టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నేతలంతా ఢిల్లీకి పయనమయ్యారు.

అక్కడ మన సీఎం ఎంత బిజీగా ఉన్నాడో.. వీళ్లు కూడా బీజేపీ నేతలను కలుస్తూ అంతే బిజీబిజీగా ఉన్నారు. ఇవాళ కూడా ఢిల్లీలోనే మకాం వేయనున్నారు. మీరు పట్టించుకోనప్పుడు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న బీజేపీ పంచన చేరి పనులు చేయించుకుంటే సరిపోతుంది.. అని పక్కా నిర్ణయానికి వచ్చేశారు వీరంతా.

టీఆరెస్‌కు ఎలా గుణపాఠం చెప్పామో తెలిసి కూడా రేవంత్ తమను తక్కువ చేసి చూడటం, అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా అవమాన పర్చడాన్ని ఇజ్జత్ కా సవాల్‌గా తీసుకున్నాయి ఉద్యోగ సంఘాలు. అందుకే బీజేపీ యూటర్న్ అయ్యాయి.

ఇక లోకల్‌బాడీ, మున్సిపల్ ఎన్నికల్లో కొంత బీజేపీ పవర్ పెంచే పనిని చేసి పెడతారన్నమాట ప్రతి ఫలంగా. ఒక్కదెబ్బకు రెండు పిట్టలు. రేవంత్ సర్కార్‌ను దెబ్బతీయటం, బీజేపీని బలోపేతం చేయడం.

సర్కార్ ఏర్పడి ఏడాది కాకముందే ఉద్యోగ సంఘాలు అధికార పార్టీకి దూరమవుతాయని ఎవరూ ఊహించలేదు. కానీ ఇక్కడ పరిస్థితులు గమనించిన సంఘ నేతలు.. తమను ఎప్పటికీ కేసీఆర్ మనుషులుగానే చూస్తారే తప్ప సంఘ నేతలుగా గౌరవించరని వారు డిసైడ్ అయ్యారు. దీనికి తోడు ఈటల రాజేందర్ మధ్యవర్తిత్వం పనిచేసింది.

కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. ఇన్‌కమ్‌టాక్స్ పెంపు,సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు తదితర అంశాలు కేంద్ర పరిధిలోకి పరిష్కారమవుతాయని ఈ గట్టువైపుకు మళ్లారు.

ఈ పరిణామం రాష్ట్రంలో సర్కార్‌కు, ఉద్యోగ సంఘాలకు మధ్య ఘర్షణ వాతావరణాన్నే సృష్టించనుంది.



5

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 30, జూన్ 2024



# ప్రజల కళ్లల్లో సంతోషాన్ని ఆస్వాదిస్తాం

- ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించిన మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం,మహానాడు:**

ప్రజల సమస్యలను పరిష్కరించి వారి కళ్ళల్లోని ఆనందాన్ని ఆస్వాదిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.స్థానిక బృందావన థియేటర్



పక్కన గల నియోజకవర్గ టీడీపి కార్యాలయంలో ఆయన శనివారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్య క్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా ఆలకించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.



అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి శనివారం ఉదయం 8 గంటల నుండి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు ప్రత్యక్షంగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చని, మిగతా రోజుల్లో తమ సమస్యలకు పార్టీ కార్యాలయంలో సంప్రదించ వచ్చని తెలిపారు.

నేడు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మూడొందలకు పైగా అర్జీలను స్వీకరించామని, ఆయా సమస్యలపై సంబంధిత శాఖాధికారులతో చర్చించి, సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అర్జీదారుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

అదేవిధంగా రానున్న రోజుల్లో మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి డివిజన్లో పర్యటిస్తామన్నారు. ఎంతోకాలంగా నగరవాసులను పట్టిపీడిస్తున్న డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలను



పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో వచ్చే నెల మొదటి తేదీన ఉదయం 6 గంటల నుండి ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన రూ.4 వేల పింఛను జూలై 1న అందిస్తామని, ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు పెంచిన రూ 4 వేలను కలుపు కొని మొత్తం రూ.7 వేలు ఆ రోజున లబ్ధిదారులకు అందించ నున్నట్లు తెలిపారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలుపరుస్తూ అర్హులైన లబ్ధిదారులం దరికీ అందిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ నాగేశ్వర రావు, పార్టీ నాయకులు లంకె నారాయణ ప్రసాద్, మీనవల్లి నాగేశ్వరరావు, గోపు సత్యం, వెంకట్, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభించిన శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

**జగ్గయ్యపేట,మహానాడు:**

జగ్గయ్యపేట పట్టణంలో బస్టాండ్ వద్దగల స్మైల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ సేవలు మరియు E.H.S. సేవలను జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ యాజమాన్యం డా.సందీప్, డా.వెంకట్, డా. అవినాష్, రిటైర్డ్ ఉద్యోగులు, హాస్పిటల్ సిబ్బంది, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జగన్ నిర్ణయాలు పేదల పాలిట శాపాలు

- సర్వశిక్ష అభయాన్ నిధులతో పాఠశాల ఆవరణలో పక్కా భవనాలు నిర్మిస్తాం
- విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ,మహానాడు:**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు పేద విద్యార్థుల పాలిట శాపాలుగా మారాయని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు.

శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్లోని తాడికొండ సుబ్బారావు మున్సిపల్ బీపాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం రామాలయం నూతన కమిటి ఎన్నికైన సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గద్దె రామమోహన్ పాల్గొని అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 400 మంది అన్న ప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లా



డుతూ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న పలు నిర్ణయాల వల్ల పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యాశాఖలో ఎయిడెడ్ విద్యా సంస్థలపై జగన్ తీసుకున్న నిర్ణయం కారణంగా ఎన్నో ఎయిడెడ్ విద్యాసంస్థలు మూతపడ్డాయన్నారు.

దీనివల్ల పేద విద్యార్థులు చదువుకు దూరం అయ్యారని చెప్పారు. ఎయిడెడ్ వ్యవస్థ వల్ల ప్రభుత్వంపై కొద్దిగా భారం పడినా పేద ప్రజలకు విద్యా పరంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఎయిడెడ్ వ్యవస్థ ఏర్పాటుపై నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు చేస్తున్నారని చెప్పారు.

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే టీచర్ల భర్తీ కోసం మెగా డీఎస్సీ ఫైలుపై మొదటి సంతకం చేశారన్నారు. సర్వశిక్ష అభియాన్ పథకంలోని నిధులతో ఈ పాఠశాలలో ఖాళీ స్థలాల్లో భవనాలు నిర్మాణం చేసి పదో తరగతి వరకు చదువుచెప్పడంతో పాటుగా జూనియర్ కళాశాలను కూడా ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. గతంలో



ఇక్కడ ఉ న్న ఆర్సీఎం స్కూల్లో పదో తరగతి వరకు చదువు చెప్పడానికి అంగీకరించారని, వైఎస్. జగన్ అధికారంలోకి వచ్చి ఆ స్కూల్ను మూసివేశారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, వేముల దుర్గారావు, రాయిరంగమ్మ, ప్రధాన ఉపాధ్యాయులు బి.శ్రీదుర్గ, గోగుల రమేష్, వేమల వెంకటేష్, కొక్కెర తిరుపతయ్య, తలపాటి ప్రసాద్, మొకర రమణ, వీరబాబు తదితరులు ఉన్నారు.

**స్వయంఉపాధి నిమిత్తం టిఫిన్ బండి పంపిణీ**

17వ డివిజన్ రాణిగారితోటలో స్వయం ఉపాధి నిమిత్తం ఉప్పల విజయలక్ష్మికి గద్దె రామమోహన్ సొంత నిధులతో రూ.25వేలు విలువ చేసే టిఫిన్ బండిని ఉచితంగా అందజేశారు.

**చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి**

చంద్రబాబు నాయుడు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్ జమ్మిసెంటర్ వద్ద గల ఎల్.ఎన్ టవర్స్ కాలనీ వాసులతో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆత్మీయ సమావేశం శనివారం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీలపై నమ్మకంతోనే ప్రజలు కూటమి అభ్యర్థులకు ఇంతటి ఘన విజయాన్ని అందించారని చెప్పారు. తూర్పు నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా మూడో సారి గెలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# డిజిపిని కలిసిన నరసరావుపేట ఎంపీ లావు

**మంగళగిరి,మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుని నరసరావుపేట ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాల యంలో ద్వారకా తిరుమల రావుని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడులోని పలు ముఖ్యమైన అంశాలపై డిజిపితో శ్రీకృష్ణదేవరాయలు చర్చించారు. శ్రీకృష్ణదేవరాయలు వెంట నరసరావుపేట నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త సయ్యద్ జిలాని, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే



మక్కెన మల్లికార్జున రావు ఉన్నారు.



## విభజన చట్టం ప్రకారం రావాల్సిన ఆస్తులపై

# మంత్రి నారాయణ సమీక్ష

- తెలంగాణలో ఉన్న మున్సిపల్ శాఖ కు సంబంధించిన ఉమ్మడి ఆస్తుల వివరాల పై ఆరా తీసిన మంత్రి
- షీలా బిడే కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయం

**విజయవాడ,మహానాడు:**

రాష్ట్ర పునర్విభజన జరిగి పదేళ్లు పూర్తయింది.చట్టంలో పేర్కొన్నట్లుగా హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు కూడా ముగిసింది.అయినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజన ఇంకా పూర్తి కాలేదు..ఇప్పటికే వేల కోట్ల ఆస్తులు ఉన్న సంస్థల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.

ముఖ్యంగా తొమ్మిది, పదో షెడ్యూల్ లో ఉన్న సంస్థల మధ్య విభజన ఇంకా కొలిక్కిరావడం లేదు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు ఆంధ్ర ప్రదేశ్ – తెలంగాణ రాష్ట్రాలు జనాభా ప్రాతిపదికన ఆస్తులు,అప్పులు పంపిణీ చేసుకోవాలని ఉంది..కానీ ఆ తర్వాత పంపకాల విషయంలో ఎక్కడ ఉన్నవి ఆ రాష్ట్రానికే చెందాలని తెలంగాణ ప్రభుత్వం కొత్త అంశాన్ని తెరమీదకు తెచ్చింది.

దీంతో ఇప్పటికీ కొన్ని సంస్థలు విషయంలో పీటముడి వీడటం లేదు.ఇలాంటి సంస్థల్లో కొన్ని సంస్థలు మున్సిపల్ శాఖకు చెందినవి కూడా ఉన్నాయి... అలాంటి సంస్థలపై పురపాలక – పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అధికారులతో సమీక్ష చేశారు. విజయవాడలోని సీఆర్డీయే ప్రధాన కార్యా లయంలో హౌసింగ్ బోర్డు, సంబంధిత అధికారులతో మంత్రి నారాయణ చర్చించారు.

**షీలా బిడే కమిటీ నివేదిక ప్రకారమే ముందుకెళ్లాలని నిర్ణయం**

హైదరాబాద్లో ఉన్న ఏపీ హౌసింగ్ బోర్డు,డెక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హెూల్డింగ్స్ ఆస్తులపై గతంలోనే ఆస్తులు, అప్పులు జనాభా ప్రాతిపదికన విభజించడమైంది. విభజన ప్లాన్ ను కూడా అధికారుల కమిటీ ముందుంచారు. సదరు ప్లాన్ ను పరిశీలించిన తర్వాత ఎక్స్ పర్ట్ కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది.

ఈ సిఫార్సులను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లగా అక్కడ ప్రస్తుతం పెండింగ్లో ఉన్నట్లు అధి కారులు వివరించారు. ఏపీ హౌసింగ్ బోర్డు లెక్కల ప్రకారం తెలంగాణ నుంచి సుమారు 5170 కోట్లు ఆంధ్రప్రదేశ్కు రావాల్సి ఉంది. ఆయా సంస్థల ఆస్తులకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఉన్న కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి పురపాలక – పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ హాజరయ్యారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 30, జూన్ 2024



## తెలంగాణలో పవన్ కళ్యాణ్‌కి
# నీరా'జనం'

◆ తుర్కపల్లి నుంచి కొండగట్టు వరకూ ...

హైదరాబాద్,మహానాడు: ఎన్నికల్లో విజయానంతరం ఉప ముఖ్యమంత్రి హోదాలో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దర్శనానికి బయలుదేరిన పవన్ కళ్యాణ్‌కి తెలంగాణలో జనసేన శ్రేణులు అడుగడుగునా ఘన స్వాగతం పలికాయి. హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు ఇచ్చి సాగనంపారు. తుర్కపల్లి, శామీర్‌పేట, సిద్ధిపేట, కరీంనగర్, గంగా ధర తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభిమానులు, పార్టీ శ్రేణులు గజమాలలతో స్వాగతించారు. పవన్ కళ్యాణ్ విజయానికి చిహ్నంగా తల్వార్ బహూకరించి జేజేలు పలికారు. పవన్ కళ్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతం అంతా పార్టీ శ్రేణులు అభిమానులతో కిటకిటలాడింది. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ పవన్‌కళ్యాణ్ ముందుకు సాగారు. పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేందర్ రెడ్డి, తెలంగాణ ఇంఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు సాగర్, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, రాధారం రాజ లింగం, వై.నగేష్, సంపత్ నాయక్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



# మీ అందరి కష్టం వల్లే.. నేను ఎంపిగా గెలిచా

◆ మీ కష్టం మరువను

◆ బుద్దా వెంకన్న నా సీటు కోసం చాలా కష్టపడ్డారు

◆ విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ చిన్ని



విజయవాడ,మహానాడు:

నేను ఎప్పుడూ అందరి మనిషిని, ప్రజల మనిషిని. బుద్దా వెంకన్న, నాగుల్ మీరా ప్రోత్సాహం తోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను. కేశినేని నాని ఆనాడు చేసిన వ్యాఖ్యలు నన్ను బాధించాయి. చంద్రబాబుకు నేను మొదటి నుంచీ అభిమానిని. ఆయన సారధ్యంలో పని చేసే అవకాశం నాకు వచ్చింది.

మీ అందరి కష్టం వల్లే నేను ఎంపిగా గెలిచాను. ఇంత భారీ విజయం తో నాపై బాధ్యత మరింత పెరిగింది. నా శక్తి వంచన లేకుండా అభివృద్ధి కోసం పని చేస్తా. ఉడతా భక్తిగా నా వంతు సేవా కార్యక్రమాలు చేస్తా. బుద్ధా వెంకన్న, నా లాంటోళ్లు మనసులో పెట్టుకుని పైకి వేరే మాట్లాడం. మాకు ఏదనిపిస్తే అదే ఓపెన్ గా చెబుతాం. టీడీపీ కోసం పని చేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుంది.

పార్టీ అధిష్టానం మన కృషి కి తగిన విధంగా గుర్తిస్తుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరం కలిసి పని చేద్దాం. గత నాయకుడి ఒంటెద్దు పోకడలు మరచిపోండి. ఇక నుంచి మనమంతా ఒకటి. నాకు మీరు అండగా నిలిచిన తీరు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటా. పార్లమెంటు సమావేశాలు అయ్యాక మళ్లీ ఇక్కడే సమావేశం పెట్టుకుందాం.

బుద్దా వెంకన్న ఆయన సీటు కన్నా..నా సీటు కోసం చాలా కష్టపడ్డారు. నాగుల్ మీరా కూడా నా కోసం పని చేశారు. మీరు ఇచ్చిన సహకారం, మీరు పడిన కష్టం నేను మరువను. కూటమి పొత్తు వల్ల సీనియర్ నాయకులకు అన్యాయం జరిగింది. కానీ భవిష్యత్తు లో అందరికీ న్యాయం చేసేలా నా వంతు కృషి చేస్తా. కార్యకర్తలు నుంచి నాయకుల వరకు నాతో నడిచిన అందరినీ గుర్తు పెట్టుకుంటా. మనందరం టిడిపి అభివృద్ధి కోసం పని చేద్దాం.





# డి.శ్రీనివాస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

◆ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు

హైదరాబాద్,మహానాడు: ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు. కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింపజేసిన కీలక నేతల్లో డి. శ్రీనివాస్ ఒకరు అని స్మరించుకున్నారు. రాజకీయ దురంధరుడు, ఉన్నత విద్యా వంతుడు, బడుగుల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారని తెలిపారు. పార్టీలో వివిధ స్థాయిల్లో, సుదీర్ఘ కాలం పాటు ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాలను డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు. డి.శ్రీనివాస్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు.



# కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆకస్మిక తనిఖీ

◆ బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కార్యాలయంలో సర్ప్రైజ్ విజిట్

◆ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా

కోవూరు, మహానాడు:

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సర్ప్రైజ్ విజిట్ చేశారు. శనివారం బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలోని నగర పంచాయతీ కార్యాలయానికి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె.. కమిషనర్ రమణబాబుని అడిగి వివరాలు తెలుసు కున్నారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

ప్రధానంగా నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిగారి దృష్టికి తెచ్చారు. దాంతో ఆ సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా నీటి నిర్వహణ, పారిశుద్ధ్యం, ప్రజా మరుగుదొడ్ల సమస్యలపై కూడా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిగారు ఆరా తీశారు.



బుచ్చి పట్టణ అభివృద్ధిపై యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వద్దని ప్రశాంతిరెడ్డిగారు ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో డయేరియా కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించాలన్నారు. ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకూడదని ఆదేశించారు. దోమల వ్యాప్తి జరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

# మా పార్టీ కార్యాలయాల్లోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారు

◆ రాష్ట్రంలో అరాచకం నెలకొంది, తక్షణమే దాడులు ఆపాలి

◆ జోక్యం చేసుకోవాల్సిందిగా గవర్నర్‌ను కోరాం

◆ వైయస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

◆ మూడు వారాలుగా రాష్ట్రంలో టీడీపీ, జనసేన శ్రేణుల విధ్వంసం

◆ ప్రభుత్వ భవనాలపైనా దాడులకు తెగబడుతున్నారు

◆ శాంతిభద్రతలు క్షీణించినా పోలీసులు చోద్యం చూస్తున్నారు

◆ నిబంధనల ప్రకారం పార్టీ ఆఫీసులు కట్టుకుంటున్నా దుష్ప్రచారం తగదు: వైవీ సుబ్బారెడ్డి

◆ వైఎస్ఆర్‌సీపీ నాయకులు, మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని హింస, బెదిరింపులకు పాల్పడుతున్నారు

◆ మా పార్టీ ఆస్తులపై దాడులు, వ్యక్తులపై భౌతిక దాడులు జరుగుతున్నాయి

◆ రాష్ట్రమంతటా అస్థిర వాతావరణం నెలకొంది

◆ టీడీపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోంది

◆ కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై సీఎం చంద్రబాబు స్పందించాలి: అయోధ్యరామిరెడ్డి

◆ తక్షణమే జోక్యం చేసుకుని రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన సాగేలా చూడాలని కోరుతున్నాం

◆ గవర్నర్‌ను కలిసిన వైయస్సార్ సీపీ బృందం

విజయవాడ,మహానాడు:

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, ప్రభుత్వ భవనాలపై విధ్వంసం జరుగుతున్నా సీఎం చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వైయస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, తక్షణమే జోక్యం చేసుకోవాల్సిందిగా గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను వైయస్సార్ సీపీ నేతల బృందం కలిసింది. తక్షణమే దాడులను అరికట్టాలని కోరింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

### ప్రధాని, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాం: వైవీ సుబ్బారెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 రోజులుగా తెలుగుదేశం, జనసేన పార్టీల వాళ్లు వాళ్ల నాయకుల ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అటాక్ చేయడం, దారుణంగా అవమానించడం, ఇళ్ల మీద దాడులు చేయడం చేస్తున్నారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ ప్రాపర్టీలను కూడా వాటిపై వైయస్సార్ పేరు ఉందని, పార్టీకి సంబంధించిన శిలా ఫలకాలు ఉన్నాయనే కారణంతో వాటిని ధ్వంసం చేస్తున్నారన్నారు.

అప్పటికీ పోలీసులు స్పందించకపోవడంతో ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకెళ్లి, రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశామన్నారు. అయినప్పటికీ నేటికీ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అదే విధంగా ఉందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు యథావిధిగా జరుగుతున్నాయన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసిన దళిత కుటుంబాలను కూడా దారుణంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డాక్టర్ వైయస్సార్ విగ్రహాలను కూడా తగలబెట్టే పరిస్థితి ఈ రాష్ట్రంలో వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇంత విధ్వంసకర కార్యక్రమాలు చేస్తున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు తప్ప కనీసం కేసులు కూడా బుక్ చేసే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. ఇంత దారుణమైన పరిస్థితులు వచ్చిన నేపథ్యంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరామన్నారు.

### మా పార్టీ ఆఫీసుల్లోకి ప్రవేశించి బెదిరింపులు

ఒక వారం రోజులుగా మరో అడుగు ముందుకేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసుల్లోకి అక్రమంగా ప్రవేశించి, అక్కడున్న నాయకులు, కార్యకర్తలను బెదిరించి మీ కార్యాలయాలను ధ్వంసం చేస్తామంటూ బెదిరిస్తున్నారన్నారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అన్ని జిల్లాల్లో ఉండే టీడీపీ నాయకులు, శాసన సభ్యుల ఆధ్వర్యంలో ఇలా జరుగుతోందన్నారు.



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భవనాలను నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్థలాలు కేటాయించిన తర్వాత భవనాలు నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో వాళ్ల పార్టీ భవనాలకు, బీజేపీ పార్టీ ఆఫీసులకు, కమ్యూనిస్టు పార్టీల ఆఫీసులకు ఏ విధంగా స్థలాలు మంజూరు చేశారో అదే విధంగా నిబంధనల ప్రకారమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులకు స్థలాలు తీసుకున్నామన్నారు.

అన్ని అనుమతులు తీసుకున్నాక బిల్డింగులు కడుతున్నామన్నారు. నిర్మాణం పూర్తయ్యే వాటి వద్దకు వెళ్లి తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు అక్కడున్నమా కార్యకర్తలను, సిబ్బందిని బెదిరించి భవనాలను కూలగొడతామంటున్నారని, వీటన్నింటినీ అడ్డుకోవాలని గవర్నర్ ని కోరామన్నారు. ఏ విధంగా ఇవన్నీ జరుగుతున్నాయో ఫొటోల ద్వారా చూపించామన్నారు. కొన్ని ఫొటోలను చూసి గవర్నర్ గారు ఇంత దారుణంగా పరిస్థితి ఉందా అని చాలా ఆశ్చర్యపోయారన్నారు.

### హింసాత్మక ధోరణి కొనసాగరాదు: ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన వాళ్లు విజయాన్ని ఆస్వాదిస్తూ ఒక పద్ధతిలో ఓడిన వారికి షేక్ హ్యాండ్ ఇచ్చేలా ఉండాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. ప్రతిపక్షంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వైయస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడులు చేస్తున్నారని, వీటిని ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో గవర్నర్ దృష్టికి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు అయిపోయిన తర్వాత వస్తున్న ఈ హింసాత్మక ధోరణి కొనసాగరాదని, ఇలాంటి దుశ్చర్యలను ఏ పార్టీ అయినా ఖండించాలన్నారు.

### పార్టీ ఆఫీసుల నిర్మాణంపై దుష్ప్రచారం వద్దు

ఏ పార్టీ అయినా పార్టీ ఆఫీసులు కట్టుకోవడానికి 2014-19లో ఏరకమైన జీవో చంద్రబాబు తెచ్చారో అదేవిధంగా వైయస్సార్ కాంగ్రెస్ కూడా కేటాయించిందని అయోధ్యరామిరెడ్డి అన్నారు. నిబంధనల ప్రకారమే పార్టీ ఆఫీసుల నిర్మాణం జరుగుతోందని, ఇవి అక్రమ నిర్మాణాలు కాదని స్పష్టం చేశారు. కానీ ఎవరంటే వారు వెళ్లిపోయి పార్టీ ఆఫీసులను స్వాధీనం చేసుకుంటామని, వేలకోట్ల ప్రజాధనం వృధా అయిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

ఒక్కో ఆఫీసు 10 వేల చదరపు అడుగులు ఉంటుందని, ఈరోజు నిర్మాణ ఖర్చు చదరపు అడుగుకు రూ.2000 నుంచి రూ.2500 వరకు ఉందన్నారు. అంటే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఒక్కో ఆఫీసు నిర్మాణ ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటి వరకు 18 ఆఫీసులు నిర్మాణం అయ్యాయని, దాదాపు రూ.60 కోట్ల వరకు ఖర్చు పెట్టామన్నారు.

కానీ రూ.500 కోట్ల నుంచి రూ.5000 కోట్ల దాకా ప్రజాధనం దుర్వినియోగమైనట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆపించాలని, మేం కట్టుకుంటున్న పార్టీ ఆఫీసులపై దాడులు జరగకుండా వ్యవస్థను అదుపులో ఉంచాలని ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. దాడులను ఆపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నారాయణ మూర్తి, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

7

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 30, జూన్ 2024

## బీహార్ ప్రత్యేక హెూదాకు తీర్మానం



బీహార్, మహానాడు:
బీహార్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వాలని జేడీయూ తీర్మానం చేసింది. తమ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా లేదంటే ప్రత్యేక ప్యాకేజీ కేంద్రం ఇచ్చేలా డిమాండ్ చేయాలని జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించింది. కాగా, జేడీయూ ప్రస్తుతం కేంద్రంలో ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉంది. దీన్ని ఉపయోగించుకొని రాష్ట్ర ప్రయోజనాల కోసం దీర్ఘకాలికంగా ఉన్న డిమాండ్ సాధనకు కృషి చేయాలని భావిస్తోంది.

## 'నాన్నతో డీఎస్ అనుబంధం మర్చిపోలేను'



విజయవాడ, మహానాడు,
సీనియర్ రాజకీయ నేత డి. శ్రీనివాస్ మరణంపై వైసీపీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తండ్రి రాజశేఖర్ రెడ్డితో డీఎస్‌కు ఉన్న అనుబంధం మర్చిపోలేనిదని వ్యాఖ్యానించారు. ఎన్నో పదవులు సమర్థవంతంగా నిర్వర్తించి చాలా రాజకీయ నాయకులకు డీఎస్ ఆదర్శప్రాయుడిగా ఉన్నారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.





# ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం..

- 161 కోట్లతో శాశ్వత త్రాగునీటి పథకాన్ని పూర్తి చేస్తాం
- 146 జీవో ప్రకారం ఎన్ఎస్పి స్థలంలో అభివృద్ధి పనులు
- పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి
- దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజారోగ్యన్ని కాపాడాలి
- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, మహానాడు:
వినుకొండ పట్టణాన్ని అభివృద్ధి పదంలో నడిపించి రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దరమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే జిబి ఆంజనేయులు అన్నారు. వినుకొండ మునిసిపల్ కౌన్సిల్ హాల్లో చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు అందరూ పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో 29 అంశాలను కౌన్సిల్ ఆమోదించంది. అనంతరం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నాడు టిడిపి హయంలో 161 కోట్ల నిధులను ప్రభుత్వం నుండి తీసుకురావడం జరిగింది అన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తాగునీటి పథకానికి 30% వాటా చెల్లించకపోవడం వలన తాగునీటి పథకాలు ఆచరణకు నోచుకోక ప్రజలు నేటికీ ఇబ్బంది పడుతున్నారన్నారు. తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా త్రాగునీటి సమస్యను పరిష్కరించి శుద్ధమైన తాగునీటిని అందిస్తామని అన్నారు. పట్టణంలో కోట్లు విలువచేసే ఎన్ ఎస్ పి స్థలాన్ని నాడు తాము మునిసిపాలిటీ అభివృద్ధికై 22 ఎకరాలు అప్పగించడం జరిగిందని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి చేయకుండా అసత్య వాగ్దానాలతో ప్రజలను మోసం చేశారన్నారు. తమపై ఎంతో నమ్మకంతో తిరిగి మూడోసారి ఎమ్మెల్యేగా చేసిన నియోజకవర్గ ప్రజలకు తాను ఎంతో రుణపడి ఉన్నానని, వినుకొండ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఎన్ఎస్పి స్థలంలో అభివృద్ధి చేపట్టేందుకు నాడు టిడిపి ప్రభుత్వంలో తీసుకువచ్చిన 146 జీవో ప్రకారం, టీటీడీ కళ్యాణ మండపం, స్టేడియం, లైబ్రరీ, షాపింగ్ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధిలో అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వినుకొండ పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించుటలో మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వైసిపి పాలనలో వార్డుల్లో జరగవలసిన అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులను కొందరు స్వార్ధపరుడు వారి సొంత ఆస్తుల వద్ద ఉపయోగించారని, ప్రజా ధనం దుర్వినియోగం జరిగితే సహించేది లేదన్నారు. ఐ అవార్డుల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని, పారిశుద్ధ్యం మెరుగపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దోమలు ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని కాపాడాలని సూచించారు. పట్టణంలో అంతర్గత డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. డంపింగ్ యార్డ్ నిమిత్తం మన చోట్ల స్థలాలు చూస్తే పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుందామని తెలిపారు. ఐ అవార్డుల కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకువచ్చిన, విద్యుత్తు నో వోల్టేజీ, డ్రైనేజీ, త్రాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


### వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన

# ఎమ్మెల్యే డా.చదలవాడ

- రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని వినతి
- గత ప్రభుత్వంలో ఆపిన ఆరోగ్య శ్రీ బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి
- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- గాడి తప్పిన వైద్యారోగ్య రంగాన్ని గాడిన పెట్టాలని విజ్ఞప్తి



నరసరావుపేట, మహానాడు:
గత ప్రభుత్వ అసమర్ధ,నిర్లక్ష్య పని తీరుతో గాడి తప్పిన వైద్యారోగ్య రంగాన్ని గాడిలో పెట్టే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు కోరారు. ఈ మేరకు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.జగన్ రెడ్డి ఐదేళ్ల పాటు వ్యవస్థల్ని నాశనం చేశాడని,అందులో ముఖ్యంగా వైద్యారోగ్య రంగాన్ని పూర్తిగా దెబ్బతీశాడన్నారు. వర్షాకాలం వస్తుండడంతో.. వ్యాధులు ప్రబలకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అదే సమయంలో ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా మెరుగైన వైద్యం అందించాలన్నారు. పేదలు ఎక్కువగా నమ్ముకునే ప్రభుత్వా సుపత్రుల్లో సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని డా.చదలవాడ తెలిపారు. డా.చదల వాడ వెంట రాష్ట్ర బులియన్ గోల్డ్ మర్చంట్ అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్ ఉన్నారు.




## డా.గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం...!

దర్శి,మహానాడు
డా.గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నేడు అద్దంకి రోడ్ గడియార స్తంభం సెంటర్, గవర్నమెంట్ హై స్కూల్‌లో ఉదయం 9.గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో చూపించుకున్న వారికి ఉచితముగా ఒ.పి., కన్సల్టేషన్, స్కానింగ్, ఎక్స్ రే మరియు మందులు ఇవ్వబడును. ఇ.సి.జి., షుగర్, బి.పి. పరీక్షలు చేయబడును. ఆరోగ్యశ్రీ, ఇన్సూరెన్స్, EHS ద్వారా ఆపరేషన్లు ఉచితముగా చేయబడును. దర్శి నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరు.

# విద్యా వ్యవస్థను గాడినపెడతాం..

- గత ప్రభుత్వం విద్యా వ్యవస్థ మొత్తాన్ని భ్రష్టుపట్టించింది
- ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించే బాధ్యత మేం తీసుకుంటాం
- విద్యా వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు హామీ



నరసరావుపేట, మహానాడు:
జగన్ రెడ్డి పాలనలో అధ్వాన్నంగా తయారైన విద్యా వ్యవస్థను మెరుగు పరిచే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని శ్రీ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించారు.సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు చెక్ చేసి హాజరు శాతాన్ని పరిశీలించారు. 550 మందికి పైగా విద్యార్థులు ఉన్నా.. జగన్ రెడ్డి పాలనలో ఉపాధ్యాయ నియామకాలు లేక అవస్థలు పడ్డామని,టీడీపీ ప్రభుత్వం రాగానే ఉపాధ్యాయ నియామకాలు జరిగినట్లు సిబ్బంది పేర్కొన్నారు. విద్యా వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.గత పాలకులు ఉపాధ్యాయ నియామకాలు జరపకపోగా, ఉన్న స్కూళ్లను మూసి వేయించారన్నారు. వేలాది మంది విద్యార్థుల్ని రోడ్డున పడేశారన్నారు. జగన్ రెడ్డి లాంటి మూర్ఖులకు చదువుల గురించి ఏం తెలుసునని ప్రశ్నించారు. పిచ్చోడి చేతిలో రాయిలా జగన్ రెడ్డి చేతిలో అధికారం తయారైందని మండిపడ్డారు.ఇక పై ప్రభుత్వ స్కూళ్లను ఉపాధ్యాయ నియామకాలతో కొత్త వెలుగులు తీసుకొచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీఈవో, స్కూల్ హెచ్ఎం,టీడీపీ నాయ కులు సీలు బాబురావు,నెలటూరి మురళి, పాపారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం ఢిల్లీలో కేంద్ర రోడ్లు, రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరిని కలిసి బాపట్ల నుండి విజయవాడ వరకు గల 65 కిలోమీటర్ల రాష్ట్ర రహదారి-40ను జాతీయ రహదారిగా మార్చవలసినదిగా కోరిన బాపట్ల లోక్ సభ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్. తద్వారా నిజాంపట్నం పోర్ట్, సెజ్,బాపట్ల & చీరాల బీచ్‌లు, చీరాలలోని టెక్స్టైల్ పార్క్‌కు మరియు బాపట్లలో ఏర్పాటు కాబోయే ఐటీ హబ్ మరియు బయోటెక్ సిటీకు కనెక్టివిటీ పెరుగుతుందని గడ్కరికి తెలిపారు.



### టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాను సత్కరించిన

## నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ

మంగళగిరి,మహానాడు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవిందబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పొలిట్ బ్యూరో సభ్యులు, గనులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి పల్లా శ్రీనివాసరావును సన్మానించారు.బీసీలకు తెలుగుదేశం పార్టీలో ఇచ్చే ప్రాధాన్యతకు పల్లా శ్రీనివాసరావు నియామకం నిదర్శనం అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీలని అన్నారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు అనునిత్యం తోడుగా ఉంటామన్నారు. పార్టీలోకి యువతను ఆకర్షించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని డా.చదలవాడ అరవింద బాబు కోరారు.

### ప్రభుత్వానికి ప్రజానీకానికి వారధిగా

## తెలుగుయువత పనిచేయాలి

మంగళగిరి,మహానాడు:
"ప్రభుత్వానికి ప్రజానీకానికి వారధిగా తెలుగుయువత పనిచేయాలని తెలుగు యువతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు."

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.



ఈ సందర్భంగా తెలుగుయువతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి ప్రజానీకానికి వారధిగా తెలుగుయువత పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు ఇటీవల వరకు వైకాపా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపైన వివిధ రూపాలలో పోరాడామని ఇకనుండి తెలుగుదేశం ప్రభుత్వం చేయబోతున్న ప్రతి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్తామని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ తెలియజేసారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 30, జూన్ 2024

# అర్హులందరికీ జులై 1న పెన్షన్ల పంపిణీ

- మంత్రి స్వామిచే పెన్షన్ల పంపిణీ మహోత్సవం...
- తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమినేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి,మహానాడు:
జులై 1న పెన్షన్ల పండుగ దర్శిలో మంత్రి స్వామిచే పెన్షన్ల పంపిణీ మహోత్సవం... తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి నేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పారదర్శకంగా అర్హులందరికీ ఇంటి వద్దనే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమం మన ప్రజా ప్రభుత్వం ప్రారంభించింది నవ్యాంధ్ర రథసారథి ప్రజా ప్రభుత్వ అధినేత గౌరవనీయులు నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు సారధ్యంలో పెన్షన్లు పంపిణీ మహోత్సవం జరుగుతుంది మన దర్శి మండలం, రాజంపల్లి గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు మన గౌరవ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభమవు తుందని... ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నారాపుశెట్టి పాపారవు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొంటారు అని తెలియజేస్తున్నాము. దర్శి నియోజకవర్గం లోని అధికారులు ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ పెన్షన్ల పండుగలో పాల్గొనాల్సిందిగా కోరుచున్నాము ప్రతి ఒక్కరికి ఇచ్చే 4000 పెన్షన్ తో పాటు ఎన్నికలకు ముందు మన ప్రియతమ నేత చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలో భాగంగా పోయిన నెల 3000 పెన్షన్ కలిపి రేపు ఇచ్చే పెన్షన్ ఒక్కొక్కరికి 7000గా ఉంటుందని తెలియజేస్తున్నాము. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందజేయబడతాయని ఇప్పటికే మన ప్రభుత్వం ప్రకటించింది ఇంటి వద్ద నుండే పెన్షన్లు తీసుకోవచ్చని తెలియజేస్తున్నాము మన ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే పెన్షన్ల పంపిణీ ఒక పారదర్శకంగా నిర్వహించడం స్వయంగా



మన ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కూడా మంగళగిరి నియోజకవర్గంలో పెనుమాక గ్రామంలో పెన్షన్ దారులకు స్వయంగా ముఖ్యమంత్రి అందజేయడం ఒక చరిత్రగా చెప్పవచ్చు అదేవిధంగా మన మంత్రివర్యులు కూడా అదే బాటలో మన దర్శి నియోజకవర్గం నుండి ఈ పెన్షన్లు పంపిణీ నీ నీ ప్రారంభించడం దర్శి ప్రాంత ప్రజానీకం తరపున మంత్రి స్వామి గారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.



# విజిలెన్స్ విచారణ జరగాలి

- అలసత్వం, నిర్లక్ష్యం సహించేది లేదు : పెమ్మసాని
- జిజిహెచ్‌లో కాంట్రాక్టుల నిర్వహణపై పెమ్మసాని ఆగ్రహం
- విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఆదేశాలు

గుంటూరు, మహానాడు:
'ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణాలు, తదితర కాంట్రాక్టులపై విజిలెన్స్ విచారణ జరగాలి. ఏ స్థాయిలో తప్పు జరిగిందనేది వెలికి తీయాలి. ఆసుపత్రిలో సౌకర్యాలు, పార్కింగ్, సి. టి స్కాన్ సమస్యలకు పరిష్కారం చూపాలి.' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు కలెక్టర్ నాగలక్ష్మి గారికి సూచించారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో గల సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, వైద్యులు, అధికారులతో పెమ్మసాని శనివారం సమావేశం అయ్యారు. కార్యక్రమంలో ముందుగా ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డ్, క్యాజువాలిటీ, ఎం.ఆర్.ఐ విభాగం, ఐ.సి.యు, అడ్వాన్స్ ఐ సి యు విభాగాలను ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడి సౌకర్యాల, సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డు రిస్ట్రక్చర్, ఈ.సీ.జీ యంత్రాల అదనపు అవసరాలను వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ పార్కింగ్ ప్రాంగణం విస్తరించాలని, రోగుల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరారు.

### సి.టి. స్కాన్ యంత్రం రిపేర్లు

సమావేశంలో భాగంగా పలు సౌకర్యాల గురించి మాట్లాడుతూ సి.టి స్కాన్ పనితీరుపై వైద్యులను కేంద్ర సహాయ మంత్రి వివరాలు అడిగారు. కాగా గడిచిన ఏడాది కాలంగా సి.టి స్కాన్ పనిచేయడం లేదని, సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించినా స్పందించడం లేదని సూపరిండెంట్ డా. కిరణ్ కుమార్ వివరించారు. దీనిపై పెమ్మసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది నుంచి సి.టి స్కాన్ పనిచేయకపోతే, నేటికీ కారణాలు చెబుతూన్న అధికారుల తీరుపై ఆయన సీరియస్ అయ్యారు. తక్షణమే సి.టి స్కాన్ యంత్రాలకు రిపేర్లు పూర్తి చేయించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన ఆదేశించారు.

### అరకొర నిర్మాణాలు

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మితమవుతున్న నిర్మాణాలకు సంబంధించి సమావేశంలో ఆయన అధికారులను వివరాలు అడిగారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్ భవనం నిర్మించాలని గతంలో నిర్ణయాలు జరిగాయి. అందుకు తగ్గట్టుగానే మాజీ ఎంపీ గల్లా జయదేవ్, దాతల నిధులను సమకూర్చారు. అయితే ఎన్ని గడుస్తున్నా ఆ నిర్మాణాలు నేటికీ పూర్తి కాకపోవడంపై సమావేశంలో పెమ్మసాని విస్మయం వ్యక్తం చేశారు. అప్పటి డి.పి.ఆర్ లకు అనువుగా నిధులు విడుదలై ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడం, అందుకు అధికారులు చెప్పిన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో, నిర్మాణాల కాంట్రాక్టులపై




విజిలెన్స్ విచారణకు కలెక్టర్ కు ఆయన ఆదేశించారు. తప్పు చేసింది నిజమే అయితే కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ స్థాయిలో తప్పు జరిగిందో పూర్తి వివరాలను వెలికి తీయాలని కలెక్టర్ కు కేంద్ర సహాయ మంత్రి ఈ సందర్భంగా సూచించారు. హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీని త్వరలోనే ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలోనే జీజీహెచ్‌లో సౌకర్యాలలేమి, లోపాలు, సమస్యలపై విచారణ జరిపించాలని అధికారులకు స్పష్టం చేశారు.

### పలు సమస్యలపై..

అలాగే ప్రభుత్వపత్రిలోని సౌకర్యాల లేమి, నిర్వహణ లోపాలపై పలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలపై వైద్యాధికారులను కేంద్ర మంత్రి ప్రశ్నించారు. ఏ.సీలు, రోగులకు ఉపయోగపడే లిఫ్ట్ లు, పనిచేయకపోవడం వంటి సమస్యలకు గల కారణాలపై వివరాలు అడిగారు. తక్షణమే సమస్యలకు పరిష్కారాలు చూపించాలని ఆదేశించారు. పలు ఘటనల్లో వైద్యులపై ఆసుపత్రి సిబ్బందిపై జరుగుతున్న దాడులను కూడా నియంత్రించాలని, అవసరమైతే భద్రత సిబ్బందిని మరింత పెంచుకోవాలని సూచించారు. అలాగే మహాప్రస్థానం వాహనాలను రాత్రి వేళలో కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరిన అధికారుల వినతులపై కేంద్రమంత్రి పెమ్మసాని గారు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలోఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, పిడుగురాళ్ల మాధవి, బోర్ల రామాంజనేయులు తెనాలి శ్రావణ్ కుమార్ తోపాటు ఆసుపత్రి అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## బియ్యం బకాసురులందరి
# బండారం త్వరలోనే బట్టబయలు

- ప్రత్తిపాటి



చిలకలూరిపేట, మహానాడు:
రాష్ట్రంలో పేదల బియ్యం బొక్కేసి, అడ్డదారుల్లో వందలు, వేల కోట్లకు పడగలెత్తిన వైకాపా బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు కావడం ఖాయమన్నారు మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. పేదలు, బీదల ఆకలి తీర్చే రేషన్ బియ్యాన్ని పక్క దారి పట్టించి బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకున్న దొంగలు ఏ స్థాయిలో ఉన్నవారైనా ప్రజాప్రభుత్వంలో వదిలిపెట్టే ప్రసక్తే ఉందన్నారాయన. కొద్దిరోజులుగా పౌరసరఫరాల శాఖకు సంబంధించి వెలుగు చూస్తున్న విస్తుపోయే వాస్తవాల నేపథ్యంలో శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గడిచిన అయిదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలన్నీ తవ్వితీయాల్సిన సమయం వచ్చిందన్నారు.

కాకినాడ పోర్టు ద్వారా ఏ ఏ దేశాలకు ఎంతెంత దొంగతనంగా ఎగుతులు చేశారు, ఆ బియ్యం ఏ ఏ ప్రాంతాల నుంచి అక్కడికి ఎలాచేర్చారో మొత్తం వెలికితీస్తే సగమంది వైకాపా నేతలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. తమ చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించి మాజీమంత్రి విడదల రజినీపై కూడా ఇదే విషయంలో తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్నిఈ సందర్భంగా గుర్తు చేశారు ప్రత్తిపాటి. పేదల బియ్యాన్ని దారిమళ్లించి, మిల్లుల ద్వారా వేలకోట్లు వెనకేసుకున్న పెత్తందార్లు, వారికి వెన్నుదన్నుగా నిలిచి వారిని చట్టం ముందు నిలబెట్టాల్సి ఉందన్నారు.

జూన్ 4 నుంచి ఆ దొంగల పాలనకు, సంక్షేమయుగానికి మధ్య తేడాను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు ప్రత్తిపాటి. చెప్పిన మాట ప్రకారం తొలిఅయిదు సంతకాల్లోనే పింఛన్ల పెంపునకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబును పేదలంతా గుండెల్లో పెట్టుకు ంటున్నారని తెలిపారు. నాడు – నేడు కూడా పింఛన్ల పెంపుతో అవ్వాతాతల కళ్లలో నిజమైన ఆనందం, వెలుగులు నింపారని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉండి, ప్రతినెలా వందల కోట్లు భారం పడుతున్నా ఇచ్చినమాట ప్రకారం పింఛనును రూ.4వేలు చేసిన నిజమైన ఛాంపియన్ చంద్రబాబు అని కొనియాడారు ప్రత్తిపాటి పుల్లారావు.



## గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు
# మెరుగైన వైద్యసేవలు అందించాలి

**- కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్**

గుంటూరు, మహానాడు:
గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతగా పనిచేయాలని, ఆసుపత్రిలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారంకు స్థానిక శాసనసభ్యులను సమన్వయం చేసుకొని ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

శనివారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ , శాసన సభ్యులు మహ్మద్ నజీర్, గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్‌తో కలసి పరిశీలించారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్యవిభాగంలో రోగులకు అందిస్తున్న సేవలను, నిర్మాణంలో ఉన్న భవనాల పనులను పరిశీలిం చారు. నాట్కో కేన్సర్ కేర్ విభాగంలోని సెమినర్ హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన ప్రాధమిక వివరాలు, వైద్యవిభాగాలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యపరీక్షలు, మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు, జింకాన, నాట్కో ట్రస్ట్ ల ద్వారా అందిస్తున్న వైద్యసేవలు విభాగాల వారీగా పరిష్కరించాల్సిన సమస్యలపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, సంబంధిత విభాగాల అధిపతులు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా కేంద్ర మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ మాటాడుతూ సీటీ స్కాన్‌కు సంబంధిత ఏజెన్సీ ద్వారా తక్షణమే మరమ్మత్తులు నిర్వహించాలని, ఎజెన్సీ స్పందించకపోతే చర్యలు తీసుకోవాలని సూపరిండెంట్ ను ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న ఎంసీఎంసీ బ్లాక్ నిర్మాణం పూర్తి అయ్యే సమయానిక అందులో అవసరమైన పరికరాల సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జీజీహెచ్ కు కేటాయించిన కార్మిక శాఖ స్థలంలో నిర్మించాల్సిన వైద్యవిభాగంపై ప్రతిపాదనలు అందించాలన్నారు. డైట్ క్యాంటిన్ నిర్మాణానికి, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీని వెంటనే ఏర్పాటు చేసి స్థానిక శాసన సభ్యులను సమన్వయం చేసుకొని ఆసుపత్రిలోని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రిలో అభివృద్ధి పనుల నిర్మాణాలను పూర్తి స్థాయిలో పరిశీలించి అవసరమైతే విజిలెన్స్ శాఖ ద్వారా విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి సూచించారు. భవిష్యత్తు అవసరాల దృష్టిలో ఉంచుకొని అవసరమైన వైద్యులతో పాటు, ఇతర సిబ్బంది నియామకాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు సమయాపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలను అందించాలన్నారు. వైద్యపరీక్షలు, లిఫ్ట్ లు, ఎసీల మరమ్మత్తు వంటి చిన్న చిన్న పనులు వెంటనే చేపట్టేలా పరిపాలన శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చేందుకు, మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రతి నెల అధికారులతో స్వయంగా సమీక్షించటం జరుగుతుందని,



స్థానిక శాసనసభ్యులు తరుచు ఆకస్మకి తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందించే సేవలలో లోపాలను గుర్తిస్తే చర్యలకు సిఫార్స్ చేయటం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధుల ప్రైవేటు కార్యక్రమాలను ఆసుపత్రిలో నిర్వహించవద్దని, వాటిలో వైద్యులు పాల్గోనరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలను జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యుల సూచనల మేరకు పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. రోగులకు సేవలు అందించే వైద్యులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన బందోబస్తుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు, స్వచ్ఛంద సేవా సంస్థలను బాగస్వాములను చేసి అవసరమైన అభివృద్ధి పనుల చేపట్టడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. జింకాన, నాట్కో కాన్సర్ ట్రస్ట్ సేవలను మరింత మంది ఆదర్శంగా తీసుకునేలా సంబంధిత ప్రతినిధులను రాష్ట్ర స్థాయిలో గౌరవించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

శాసనసభ్యులు మహ్మద్ నజీర్, గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్ పలు అంశాలపై సూచనలు అందిస్తూ కేంద్రీకృతంగా ఉన్న వైద్యపరికరాల ఇతర సేవల నిర్వహణను వీకేంద్రీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భవా, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు, కేంద్ర ప్రభుత్వ నిధులు ఆసుపత్రి అభివృద్ధికి అందించేలా ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ఆసుపత్రిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. టీటీకే రెడ్డి, ఆర్ జే డీ సీహెచ్ సుధారాణి, సీఎస్ ఆర్ఎంఓ డా. బీవీ సతీష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, ఏడీ సీహెచ్ నాగేశ్వరరావు, జింకాన కో ఆర్డినేటర్ డా. బాలబాస్కర్, నాట్కో ట్రస్ట్ కో ఆర్డినేటర్ వై అశోక్, బయోమెడికల్ ఇంజనీరు చంద్రశేఖర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బిప్రవీణ్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, పరిపాలన విభాగం అధికారులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 30, జూన్ 2024

# ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలి

- దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీఓలతో డా.గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేక భేటీ

**దర్శి,మహానాడు:**
దర్శి నియోజకవర్గంలో జూలై 1 నుంచే పెంచిన పెన్షన్లు ఇంటి దగ్గర ఇచ్చే కార్యక్రమం పైన 5మండలాల ఎంపీడీఓలతో సమావేశం ఏర్పాటు చేసి తగు చూచనలు చేశారు. పార దర్శకంగా పెన్షన్ల పంపిణీ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెడదాం అధికార యంత్రాంగం అందుకు అనుగుణంగా పనిచేసి ప్రజా ప్రభుత్వానికి మద్దతునివ్వండి.. మన దర్శి తెలుగుదేశం జనసేన బిజెపి కూటమినేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గత ప్రభుత్వం వలే కాకుండా ప్రతివృద్ధునికి, ప్రతి వికలాంగునికి, ప్రతి వితంతువులకి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ అందేందుకు అధికారులంతా సహకరించాలని కోరారు.

మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా రేపు జరిగే పెన్షన్ల మహెూత్సవంలో పెన్షన్ దారులకు ఆంధ్రప్రదేశ్‌లో వారి చేతుల మీదుగా పంపిణీ చేయడం దేశంలోనే ఇది ప్రజా ప్రభుత్వంగా గర్వంగా చెప్పుకునే రోజు అని అభివర్ణించారు. ప్రతి అవ్వ నుదుటిలో చిరునవ్వు చూడాలి ప్రతి వికలాంగుడు కుటుంబంలో వెలుగు చూడాలని మన అధినేతలు మనకు ఇచ్చిన ఆదేశాల అనుగుణంగా రేపు మన జిల్లా గౌరవ




మంత్రివర్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి కూడా దర్శి మండలం రాజంపల్లిలో జరిగే పెన్షన్ల పంపిణీ పండుగలో పాలొంటారు. అధికార యంత్రాంగం సేవా దృక్పథంతో ప్రజలకు సేవ చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. ప్రజలకు జవాబుదారీలుగా ఉండి ముఖ్యంగా దర్శి ప్రజానీకానికి పెన్షన్ల పంపిణీ లోను ఇతర ప్రభుత్వ పథకాల పంపిణీలోను ప్రజలకు అవసరాలు తీర్చేందుకు మనం వారికి అండగా ఉండాలని మనస్ఫూర్తిగా మీ అందరిని కోరుచున్నాను.

మీ సోదరిగా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మన అధినేత చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆశిస్తున్న ప్రజా పాలనను మనం ముందుకు తీసుకువెళ్లాలని మరొక్కసారి మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఆచార్య యార్లగడ్డ

- ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పేరు పునరుద్ధరణపై అభినందన
- ఎన్టీఆర్‌కు భారత రత్న తీసువస్తామన్న సిఎం ప్రకటన అత్యుత్తమం

**మంగళగిరి,మహానాడు:**
ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పేరును పునరుద్ధరిం చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మ భూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. అధికారం లోకి వచ్చిన మరుక్షణమే ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకోవటం అభినందనీయమన్నారు. ఈ మేరకు శనివారం విజయవాడలో ఒక ప్రకటన విడుదల చేసారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పేరును వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా మార్చడంపై కలత చెంది, నిరసన వ్యక్తం చేస్తూ అధికార భాషా సంఘం చైర్మన్ పదవితో పాటు హిందీ అకాడమీ, తెలుగు అకాడమీ ఛైర్మన్ పదవులకు లక్ష్మీప్రసాద్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.



మరోవైపు ఎన్టీఆర్‌కు భారతరత్న తీసుకువస్తామన్న సీఎం ప్రకటనను యార్లగడ్డ స్వాగతించారు. ఆరోగ్య విశ్వవిద్యాలయంకు పేరును పునరుద్ధరించటంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ సైతం వేగంగా స్పందిం చారని సంతోషం వ్యక్తం చేసారు.

ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష ప్రాముఖ్యతను చాటి చెప్పడంతోపాటు ఐక్యరాజ్యసమితిలో అధికార భాషల్లో ఒకటిగా మార్చడమే విశ్వ హిందీ పరిషత్ లక్ష్యం అని అచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ సందర్భంగా అన్నారు. హిందీ భాషకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు పరిషత్ కృషి చేస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో హిందీని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ తనవంతు సహకారం అందిస్తున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు హిందీ నేర్చుకోవాలని వైఎల్‌పి విజ్ఞప్తి చేసారు. భవిష్యత్తులో హిందీలో కూడా చట్టాలు వస్తాయన్నారు. రాజకీయాల గురించి మాట్లాడుతూ, రాజకీయాల్లో హత్యలు ఉండవు, ఆత్మహత్యలే ఉంటాయన్న ఆర్యోక్తి, వైఎస్సార్‌సీపీ విషయంలో నిజం అయ్యిందన్నారు. స్వయంకృత అపరాధమే ఈ పరిస్థితికి కారణమన్నారు.

# చంద్రబాబు కార్యసాధకుడు

- సినీ నటుడు సుమన్

**తిరుపతి,మహానాడు:**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యసాధకుడు అని ప్రముఖ సినీ నటుడు సుమన్ కొనియాడారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.



"చంద్రబాబు పాలనలో అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా జరుగు తోంది. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించబోతున్నారు. గతంలో ఉద్యోగాలు లేకుండా యువత ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సినీ పరిశ్రమలోని వారు కూడా పలు సమస్యలను ఎదుర్కొన్నారు.

సబ్జెక్ట్ తెలిసిన వ్యక్తి పవన్ కల్యాణ్‌కు మంచి శాఖలనే కేటాయించారు. ఉపముఖ్యమంత్రిగా ఆయన తన సత్తా చూపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలు సమసిపోతాయన్న నమ్మకం ఉంది. అలీ రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పడం ఆయన వ్యక్తిగతం. అయితే సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికీ పదవులు దక్కుతాయని అనుకోవడం కరెక్ట్ కాదు. ప్రజా సేవ చేస్తే పదవులు వాటికవే వస్తాయి" అని సుమన్ తెలిపారు




**కృష్ణా మచిలీపట్నం, మహానాడు:**
శనివారం కలెక్టరేట్లోని చాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసిన పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా




ఆత్మకూరు పట్టణం దళితవాడలోని శ్రీ చెన్నకేశవ స్వామి అరుగు వద్ద జరిగిన ఎస్పీజీ ఉ ఎబియం పాలెం కాలనీ వాసులతో ముఖాముఖి నిర్వహించిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి





ప్రొద్దుటూరు నియోజకవర్గ శాసనసభ్యుడిగా గెలిచి నేడు పురపాలక సాధారణ కౌన్సిల్ సమావేశానికి ఎక్స్అఫిషియో మెంబర్‌గా హాజరైన నంద్యాల వరదరాజులరెడ్డి. నంద్యాల వరదరాజులరెడ్డి కి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన పురపాలక సభాధ్యక్షురాలు భీమునిపల్లి లక్ష్మీదేవి కమిషనరు రఘునాధరెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు.



సతీ వియోగం పొందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యమును ఆల్వాల్‌లోని ఆయన నివాసంలో పరామర్శించిన గౌరవ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



తెలంగాణలో జాబ్ క్యాలెండర్ విడుదల కోసం నిరాహారదీక్ష చేస్తున్న నిరుద్యోగ జాక్ నేత మోతీలాల్ నాయక్‌ను.. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో పరామర్శించి, దీక్ష విరమింపచేసిన బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి.




జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 30, జూన్ 2024

# ప్రతీ శక్తి కేంద్రంలో మన్ కీ బాత్

- జూలై 8వ తేదీన రాజమహేంద్రవరంలో విస్తృత కార్యవర్గ సమావేశం
- ఆడియో కాన్ఫరెన్స్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడి

**అమరావతి,మహానాడు:**

సార్వత్రిక ఎన్నికల అనంతరం తిరిగి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీబాత్ కార్యక్రమం ప్రారంభం అవు తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. ఈ రోజు ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా బిజెపి శ్రేణులను ఉద్దేశించి పురందేశ్వరి మాట్లాడుతూ రేపు అనగా ఆదివారం 30వ తారీఖున మన్ కి బాత్ నిర్వహించు కోబోతున్నాము. ప్రతి శక్తి కేంద్ర స్థాయిలోను, మనకు ఉన్నటువంటి పోలింగ్ బూత్ కమిటీల ఆధ్వర్యంలో మన్ కీ బాత్ వీక్షణ కు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.


రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకు పైగా ఏర్పాటు చేసుకున్న శక్తి కేంద్రాల్లో మన్ కీబాత్ వీక్షణకు ఏర్పాట్లు చురుకుగా నిర్వహించుకోవాలన్నారు. జిల్లా కార్యవర్గాలు వీటి పర్యవేక్షణ చేయాలన్నారు.

**జూలై 8వ తేదీన రాష్ట్ర స్థాయి బిజెపి విస్తృత కార్యవర్గం సమావేశం**

ఎన్నికల అనంతరం విస్తృత కార్యవర్గ సమావేశం రాజ మహేంద్రవరంలో ఒకరోజు ఏర్పాటు చేసుకుంటున్నా మని ఇదే.



విషయం ఆడియో కాన్ఫెరెన్సులో ప్రకటించారు. మండల అధ్యక్షులుతో సహా జిల్లాలో బాధ్యతలు ఉన్నవారు అదేవిధంగా పార్టీ అనుబంద మోర్చాలు, డిపార్ట్ మెంట్‌లులో భాద్యతలు ఉన్నవారు కూడా ఈ సమావేశానికి హాజరు కావ డానికి అర్హులు అన్నారు. రాజమహేంద్రవరం లోని సరోవర్ కన్వెషన్ హాలులో ఏర్పాటు చేయడం జరిగిందని పురందేశ్వరి వివరించారు.





జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జయప్రద ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు తొండపు దశరథ జనార్ధన, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య స్కూల్ యాజమాన్యం, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.



# 'గ్రేటర్'లో కంటోన్మెంట్ విలీనం

- సివిల్ ఏరియాలన్నీ ఇక గ్రేటర్ పరిధిలోనే
- ఫలించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసుల కల
- రేవంత్‌రెడ్డి రాయబారం సక్సెస్
- బోర్డు ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ
- లీజులు ఇచ్చినవి కూడా మున్సిపాలిటీకి బదిలీ
- ఉత్తర్వులు విడుదల

**(ఎస్సెస్సార్)**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియా లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం




ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించిన మార్గదర్శ కాలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది.

కంటోన్మెంట్ బోర్డును జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా రక్షణ శాఖ మంత్రికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. మార్చి 5వ తేదీన రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటి వరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దు చేసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇటీవలే కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈనెల 25 కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లోనూ విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం కేంద్ర రక్షణ శాఖ అందుకు సంబంధించిన విధి విధానాలపై లేఖ రాశారు. దీని ప్రకారం కంటోన్మెంట్ లోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తారు.

కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. అక్కడ ఇప్పటికే లీజులు ఇచ్చినవి కూడా మున్సిపా లిటీకి బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్ లోని నివాస ప్రాంతాలకు జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరిస్తుంది. తన పరిధిలో ఉన్న వాటిపై పన్నులను విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించే టప్పుడు, సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమి వ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, తదుపరి కార్యాచరణ చేప ట్టాలని సూచించింది.





# స్వరూప పీఠానికి పప్పుబెల్లాల్లా భూములు

- అనుమతులు లేకుండానే నిర్మాణాలు
- తిరుమల కొండపై లెక్కకు మించి పాపాలు
- బాబు సర్కారు చర్యల కొరడా ఝుళిపిస్తుందా?

**(వాసు)**

ఐదేళ్లలో తిరుమల కొండపై లెక్కకు మించి పాపాలు. వసతి గదుల నుంచి దర్శనం టికెట్ల వరకు అంతా రాజకీయం. అవినీతే రాజ్యం. శారదా పీఠానికి ప్రభుత్వ భూములను మిఠాయిల్లా పంచిపెట్టారనే ఆరోపణలు. కాల్వను కబ్జా చేసి నిర్మాణం చేపట్టారని ఆగ్రహాలు. ఇంతకీ తిరుమల కొండపై ఐదేళ్లపాటు ఏం జరిగింది? వాటన్నింటిని చంద్ర బాబు ప్రభుత్వం ఎలా సెట్ చేయగలదా?

వడ్డించేవాడు మనవాడైతే.. పంక్తిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదు. మనకు రావాల్సినవి వస్తాయి. రావనుకున్నాయి కూడా వస్తాయి. ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ శారద పీఠం. ఆ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి విశాఖ శారదాపీఠం అధిపతి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన స్వామిజీ స్వరూపానందేంద్ర. ఆ సమయంలో ఎంత పేరు వచ్చిందో.. ఇప్పుడు అంతకంటే ఎక్కువ వివాదాలను ఎదు ర్కొంటున్నారు. కారణం ఆ పీఠం దక్కించుకున్న భూములు.. వారికున్న పొలిటికల్ లింక్స్.

నిన్నటి వరకు విశాఖ భూములపై రచ్చ జరిగింది. ఈలోగా వెలుగులోకి తిరుమల భూముల అంశం వచ్చి చేరింది. ఒక్క తిరుమలే కాదు.. అమరావతిలో యాగం చేసిన ప్రదేశానికి సమీపంలో మరోచోట.. ప్రకాశం జిల్లాలో ఇంకోచోట.. భూము లను కేటాయించింది జగన్ ప్రభుత్వం. దీనిపై ఆగ్రహజ్వాలలు ఎగసి పడుతున్నాయి. తిరుమలలో ధర్మ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపట్టింది శారదాపీఠం.

అయితే ఈ నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తుందన్నది ఆరోపణలు. ఇన్నాళ్లు ఈ అక్రమాలను చూసి కూడా చూడనట్టుగా వదిలేసింది తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు. వాస్తవానికి ఏ బ్లాక్‌లో నాలుగు అంతస్థులుకు పర్మిషన్ తీసు కుని ఐదు అంతస్థులు కట్టారు. ఈ విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు తిరుమల క్షేత్ర రక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్.

హైకోర్ట్ పిటిషన్‌పై విచారణ చేసి కమిషన్ ఏర్పాటు చేయడం.. ఆ కమిషన్ విచారణ చేపట్టడం.. అక్రమాలు బయటపడటం.. ఇలా వరుసగా జరిగిపోయాయి. తిరుమలలో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర చేసిన అక్ర మాలపై పలువురు స్వామీజీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శారదా పీఠం మఠాన్ని స్వామీజీలు పరిశీలించారు. అక్రమ



నిర్మాణాలుగా తేల్చేశారు. శారదా పీఠాధిపతి ఆక్రమించిన భూములతో పాటు అక్రమ నిర్మాణాలను తొలగించాలని వీరి డిమాండ్.

ఆధ్యాత్మిక గురువులకు సంబంధించి స్వామివారికి సేవ చేసుకోవడానికి, భక్తులకు ఉపయోగపడేందుకు మాత్రమే మఠాలను కేటాయిస్తారు. కానీ వాటిని నిర్వహిస్తున్న వారు మాత్రం కొండపై పెద్ద ఎత్తున భక్తుల వద్ద దోపిడీకి పాల్పడు తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే తిరుమలలో జనసేన నేతలతో కలిసి కిరణ్ రాయల్ పలు మఠాలను సందర్శించారు. కోట్ల రూపాయాల స్కాం జరుగు తోందని ఆరోపించారు.

స్వరూపానంద స్వామి రూల్స్‌ను అతిక్రమించి స్టార్ హొటల్‌ను తలపించేలా కొండపై అక్రమ కట్టడాలను కట్టడం ఏంటని ప్రశ్నించారు. తిరుమలలోని శారదా పీఠం నిర్మాణా లను కూల్చివేయాలనే డిమాండ్లు ఎక్కువవుతున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో నిర్మాణాలు ఏంటని ప్రశ్నలు వ్యక్తమవు తున్నాయి.

మరీ ముఖ్యంగా గోపురం కంటే ఎత్తులో భవనాలు ఎలా నిర్మిస్తారని భక్తులు మండిపడుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం శారదా పీఠంపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాన్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

(మొదటిపేజీ తరువాయి..)

రాజీవ్ గాంధీ చొరవతో తెలంగాణలో ఐటీ రంగం రాణించింది. తెలంగాణను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం.

రాష్ట్రంలో ఫార్మా అభివృద్ధికి ఫార్మా విలేజెస్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శంషాబాద్ లో వెయ్యి ఎకరాల్లో మెడికల్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అన్ని రకాల వైద్య సేవలు అందించేలా మెడికల్ టూరిజం హబ్ ఉండాలి. రాష్ట్రంలో ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది.

రాష్ట్రంలో ప్రతీ పౌరుడికి ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. మా ఆలోచనను ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతికంగా మీ సహాయం కోరుతున్నాం. ఆసుపత్రికి ఎంతమంది వచ్చారని కాదు. ఎంతమంది నవ్వుతూ ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లారనేది ముఖ్యం. వైద్యం అందిం చడం ఒక సామాజిక బాధ్యత. డబ్బుల కోణంలో కాదు సేవ చేయాలనే దృక్పథంతో పనిచేయాలి.

నగరానికి త్వరలో ఎయిర్ పోర్ట్ రాబోతోంది, టెక్స్టైల్ పార్కు త్వరలోనే అందుబాటులోకి రానుంది. వరంగల్‌లో హెల్త్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి చేస్తాం.






11

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 30, జూన్ 2024




## సార్.. నా పెళ్లి..
# మీరు తప్పకుండా రావాలి

### పీఎం మోదీని ఆహ్వానించిన వరలక్ష్మి - తండ్రికి థాంక్స్ చెబుతూ పోస్ట్

సౌత్ ఇండస్ట్రీలో లేడీ విలన్‌గా గుర్తింపు తెచ్చుకున్న వరలక్ష్మి శరత్ కుమార్ వివాహానికి ఆహ్వానం పనిలో పడింది. తెలుగు, తమిళం భాషలలో అనేక చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా కనిపించిన వరలక్ష్మి ఇప్పుడు ముంబైకి చెందిన పెయింట్ ఆర్టిస్ట్ నికోలయ్ సచ్?దేవ్ ని పెళ్లి చేసుకోనున్న సంగతి తెలిసిందే. దాదాపు ఏడేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరి ఇప్పుడు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఇటీవలే వీరిద్దరి నిశ్చితార్థం రెండు కుటుంబాల సమక్షంలో సింపుల్‌గా జరిగింది.

అలాగే తన పెళ్లిని కూడా సింపుల్ గానే చేసుకుంటున్న రిసెప్షన్ మాత్రం చెన్నైలో గ్రాండ్ గా చేయనున్నట్లు సమాచారం. తన రిసెప్షన్‌కు రమ్మని కొన్ని రోజులుగా పలువురు సెలబ్రెటీలను స్వయంగా కలుస్తూ ఆహ్వానిస్తుంది వరలక్ష్మి శరత్ కుమార్. ఇప్పటికే టాలీవుడ్, కోలీవుడ్ సినీ పరిశ్రమలోని చాలా మంది తారలను రిసెప్షన్ కు ఆహ్వానించిన వరలక్ష్మి ఇప్పుడు పీఎం మోదీని కలిసింది. తన పెళ్లికి రావాలని పీఎం మోదీని ఆహ్వానించింది. వరలక్ష్మి తన తండ్రి శరత్ కుమార్, రాధిక, కాబోయే భర్త నికోలయ్ సచ్ దేవ్ లతో కలిసి పీఎం మోదీని కలిసి అహ్వాన పత్రికను అందించింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తూ తండ్రికి థాంక్స్ చెప్పింది. "ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారిని కలవడం చాలా ఆనందంగా ఉంది. మోదీగారు మీ అద్భుతమైన స్వాగతంకు ధన్యవాదాలు.




## 'రౌతు కా రాజ్' స్ట్రీమింగ్

ఇండియాలో అతి పెద్దదైన ఓటీటీ ఫ్లాట్ ఫామ్ జీ5. ఎప్పటికప్పుడు ప్రేక్షకులకు సరికొత్త ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించటంలో తన ప్రత్యేకతను జీ 5 నిరూపించుకుంటేనే ఉంది. అందులో భాగంగా డైరెక్ట్ డిజిటల్ ఫిల్మ్ 'రౌతు కా రాజ్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ఈ థ్రిల్లింగ్ మిస్టరీ ఫిల్మ్‌ను ఆనంద్ సురాపూర్ దర్శకత్వంలో జీ స్టూడియోస్, ఫాట్ ఫిష్ రికార్డ్స్ నిర్మించాయి. బాలీవుడ్ విలక్షణ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ ఇందులో సమర్ధవంతమైన పోలీస్ ఆఫీసర్ దీపక్ నేగి పాత్రలో నటించారు. ఉత్తరాఖండ్ లోని రౌతు కీ బేలి అనే పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో రాజేష్ కుమార్, అతుల్ తివారీ, నారాయణి శాస్త్రి కీలక పాత్రలు పోషించారు. గత ఏడాది జీ5లో విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న హడ్డీ తర్వాత జీ5, జీ స్టూడియోస్, నవాజుద్దీన్ సిద్ధిఖీ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో 'రౌతు కా రాజ్' భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పదిహేనేళ్లుగా ఒక హత్య వంటి పెద్ద నేరం జరగని ఒక పట్టణంలోని అంధుల పాఠశాలలో వార్డెన్ అనుమానాస్పద మరణిస్తాడు. అతన్ని ఎవరు.. ఎందుకు చంపారనే పాయింట్ మీద రౌతు కా రాజ్ సినిమాను రూపొందించారు. ఆ ప్రాంతానికి చెందిన పోలీస్ స్టేషన్‌లోని స్టేషన్ హెడ్ ఆఫీసర్ దీపక్ నేగి (నవాజుద్దీన్ సిద్ధిఖీ), స్టేషన్‌లోని ఇన్‌స్పెక్టర్ దిమ్రి (రాజేష్ కుమార్)తో కలిసి కేసుని చేదించటానికి రంగంలోకి దిగుతాడు. సినిమాలోని ప్రధాన పాత్రల మధ్య చక్కటి హాస్యం కలగలిసిన సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు.

## అక్టోబర్ 10న 'కంగువ'

స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'కంగువ' రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీని అక్టోబర్ 10 దసరా పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. 'కంగువ' చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కంగువ' సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. 'కంగువ' నుంచి ఇప్పటిదాకా రిలీజ్ చేసిన సిజిల్ టీజర్, పోస్టర్స్ సినిమా మీద క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ జానర్ లో ఇప్పటిదాకా తెరపైకి రాని ఒక కొత్త కాన్సెప్ట్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతోంది సినిమా. పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు



అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో బిగ్గెస్ట్ మూవీగా 'కంగువ' సినిమాపై అటు ట్రేడ్ వర్గాల్లో, ఇటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి.

## 'కల్కి 2898 ఎడి' విజయం
# గొప్ప ఆనందాన్ని ఇచ్చింది

**విజనరీ ఫిల్మ్ మేకర్ నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన సైన్స్ ఫిక్షన్ ఎపిక్ మాగ్నం ఓపస్ 'కల్కి 2898 ఎడి'. ఈ విజువల్ వండర్ లో ఇండియన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె లీడ్ రోల్స్ లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత సి. అశ్వనీదత్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. మైథాలజీ -ఇన్స్ స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఎడి' జూన్ 27న గ్రాండ్ గా విడుదలై ప్రపంచ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షులని మహా అద్భుతంగా అలరించి, యునానిమాస్ ఎపిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకొని, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్ తో హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో నిర్మాత సి. అశ్వినీదత్ విలేకరుల సమావేశంలో 'కల్కి 2898 ఎడి' విశేషాలని పంచుకున్నారు.**

**కల్కి 2898 ఎడిపై మీ అంచనాలు ఏమిటి? మీ అంచనాలకి తగ్గ రిజల్ట్ ఎలా వచ్చింది? ఎంత హ్యాపీగా వున్నారు ?**

చాలా చాలా హ్యాపీగా వున్నాను. నిన్న మార్నింగ్ షో నుంచే.. తెలుగు రాష్ట్రాలు, ముంబై, మద్రాస్, బెంగళూరు, ప్రపంచవ్యాప్తంగా రెవల్యూషనరీ రిపోర్ట్ వచ్చింది. నేను ఏదైతే అనుకున్నానో అలాంటి అఖండ విజయం వచ్చింది. హ్యాట్సప్ టు నాగ్ అశ్విన్. ఐయామ్ వెరీ వెరీ హ్యాపీ.

**నాగ్ అశ్విన్ గత రెండు సినిమాలు చాలా సెన్సిబుల్ గా వుంటాయి. తను ఇలాంటి వైల్డ్ డెప్త్ వున్న సబ్జెక్ట్ ని హ్యాండిల్ చేయగలడనే కాన్ఫిడెన్స్ మీకు ఎప్పుడు వచ్చింది?**

-తన మొదటి సినిమా నుంచి తనతో జర్నీ చేస్తున్నాం. తను ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడనే కాన్ఫిడెన్స్ నాకు మొదటి నుంచి వుంది. అదే మా అమ్మాయిలతో చెప్పాను. తను ఏ సబ్జెక్ట్ చెప్పినా వెంటనే దూకేయమని అన్నాను. ఈ శతాబ్దంలో ఒక దర్శకుడు మా ఇంట్లోనే దొరికాడు( నవ్వుతూ).

- నా మొదటి సినిమా ఎదురులేని మనిషి నుంచి ఇప్పటివరకూ దర్శకుడు చెప్పింది వినడం, తనకు కావల్సినది సమకూర్చడం తప్పా మరో డిస్కర్షన్ పెట్టను. ఇది అందరికీ తెలుసు.


కల్కి 2898 ఎడి మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఇంకా ఏం కావాలని అడగడం తప్పా నేను ఎప్పుడు ఎక్కడ ఇంటర్ఫియర్ కాలేదు.

**అమితాబ్‌ని నాగ్ అశ్విన్ చాలా అద్భుతంగా చూపించారు కదా.. ఆయన్ని అలాంటి పాత్రలో చూడటం మీకు ఎలా అనిపించింది ?**

డైరెక్టర్‌గారు ఏం అనుకున్నారో అలానే తీస్తారని తెలుసు, అలానే తీశారు కూడా. హ్యాట్సప్ టు హిమ్.

**అమితాబ్ గారు, నిర్మాతగా మీకు గౌరవం ఇస్తూ మీ కాళ్ళకి నమస్కారించినప్పుడు మీ ఫీలింగ్ ఏమిటి ?**

నాకు తలకాయ కొట్టేసినంత పనైయింది (నవ్వుతూ). మేము కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం.



అక్కడితో ఆగిపోతాం. అయితే స్టేజ్ మీద మాత్రం ఆయన అలా చేయడం నేను అస్సల్ ఊహించలేదు. అమితాబ్ గారు లెజెండ్. హ్యాట్సప్ టు హిమ్.

**ఇందులో 'బుజ్జి' (కారు) ని కూడా ఒక పాత్ర చేశారు.. ఈ ఆలోచన చెప్పినపుడు ఎలా అనిపించింది ?**

ఇదంతా నాగ్ అశ్విన్ విజన్. ఈ కాన్సెప్ట్ గురించి చెప్పినప్పుడు చాలా అద్భుతంగా అనిపించింది. సినిమాలో చాలా గొప్పగా ప్రజెంట్ చేశారు.

**ఈ కథ అనుకున్నప్పుడే పార్ట్ 2 ఐడియా ఉందా ?**

అవునండీ. ఈ స్టోరీ అనుకున్నప్పుడే పార్ట్ 2 థాట్ వచ్చింది. కమల్ ఎంటరైన తర్వాత పార్ట్ 2 డిసైడ్ అయిపోయాం. కమల్‌ది అద్భుతమైన పాత్ర.

**పార్ట్ 2 రిలీజ్ ఎప్పుడు?**

ఇప్పుడే ఏం తెలీదండి. నెక్స్‌ట్ ఇయర్ సమ్ వేర్ ఈ టైంలోనే రావచ్చు.

**వైజయంతీ మూవీస్ నుంచి రాబోయే సినిమాలు గురించి?**

శ్రీకాంత్ అబ్బాయితో ఓ సినిమా వుంటుంది. అలాగే దుల్కర్ సల్మాన్‌తో ఓ సినిమా చేస్తున్నాం.



## వేట్టాయన్‌తో సేనాపతి

యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ జులై 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఇండియన్ 2 సినిమాను లైకా ప్రొడక్షన్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మించారు. అయిదు సంవత్సరాలుగా ప్రేక్షకులు ఇండియన్ 2 కోసం ఎదురు చూస్తున్నారు. తెలుగు లో భారతీయుడు 2 టైటిల్ తో రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

దేశ వ్యాప్తంగా చిత్ర యూనిట్ సభ్యులు ముఖ్యంగా కమల్ హాసన్, సిద్ధార్థ్, శంకర్ లు చక్కర్లు కొడుతో ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న విషయం తెల్సిందే. ప్రమోషన్ లో భాగంగా లైకా ప్రొడక్షన్స్ వారు ఈ ఫోటోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేయడం జరిగింది. భారతీయుడు 2 స్టార్ సేనాపతితో వెట్టైయన్ స్టార్ రజినీకాంత్ కలిసిన ఈ ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇండియన్ 2 మరియు వెట్టైయన్ సినిమాలను లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న విషయం తెల్సిందే. అందుకే లైకా ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుందర్ రాజన్ ఇద్దరు సూపర్ స్టార్స్ తో కలిసి ఫోటో దిగాడు. ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్స్ ను ఒకే ఫ్రేమ్ లో చూడటంతో ప్రేక్షకులు మరియు ఫ్యాన్స్ సర్‌ప్రైజ్ అవుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## "కూర్మనాయకి" ప్రాజెక్ట్‌లోకి వెల్కమ్ చెప్పిన టీమ్



టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మరో భారీ సోషియో ఫాంటసీ మూవీ "కూర్మనాయకి". ఈ చిత్రాన్ని ఎంఎం క్రియేషన్స్, కాలభైరవ ప్రొడక్షన్స్ తో కలిసి రోషన్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో కె విజితా రావ్ నిర్మిస్తున్నారు. స్నిగ్ధ మణికాంత్ రెడ్డి, పూజ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటిదాకా రానటువంటి కథా కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు హర్షవర్ధన్ కడియాల. వరలక్ష్మీ శరత్ కుమార్, సాయి కుమార్, అతిరారాజ్, వీటీవీ గణేష్ కీ రోల్స్ లో నటిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ శివాజీ ఓ ప్రధాన పాత్రను పోషించనున్నారు. ఈ రోజు శివాజీ బర్త్ డే సందర్భంగా ఆయనను పుట్టినరోజు విశెస్ తో ప్రాజెక్ట్ లోకి వెల్కమ్ చేస్తూ స్పెషల్ వీడియో రిలీజ్ చేసింది కూర్మనాయకి టీమ్. శివాజీ ఈ చిత్రంలో పవర్ ఫుల్ రోల్ చేస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తోంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144